
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 2 ఆగస్టు 2025
5



మహిళా సంఘాలకు రుణ భీమా

- సహజ మరణానికి బీమా వర్తింపు
- మొత్తం ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం
- ఏడాదిలో 14మంది ఎస్‌హెచ్‌జీ సభ్యుల కుటుంబాలకు ఊరట
- జిల్లాలోని పురపాలకాల పరిధిలో రూ.13.75లక్షల రుణమాఫీకి మెప్మా పీడీ అభిషేక్ అగస్త్య ఆమోదం

6



2020 ఆగస్టు 17న 61.6 అడుగుల వద్ద గోదావరి

ఆగస్టులో గోదా'వర్రీ'

18 సార్లు తుది ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం

- 1986 ఆగస్టు 16న 75.6 అడుగులతో భద్రాద్రి చరిత్రలోనే అత్యధిక నీటిమట్టం
- ఈసారి ఎలా ఉంటుందోనని నదీ పరివాహక ప్రాంతవాసుల ఆందోళన

భద్రాచలం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ పరివాహక ప్రాంత వాసులకు ఆగస్టు 'వర్రీ' పట్టుకుంది. జూలై నుంచి సెప్టెంబరు వరకు ఈ ప్రాంతంలో వరదల గండం పొంచి ఉంటుంది. ఈ ఏడాది జూలైలో భద్రాచలం వద్ద గోదావరి కనీసం తొలి ప్రమాద హెచ్చరిక 43 అడుగులు కూడా దాటకపోవడంతో.. నదీ పరివాహక ప్రాంతవాసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే గోదావరికి అసలైన వరదల సమయం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. 31 రోజుల పాటు గోదావరి వరద ప్రవాహం ఏ తీరున ఉంటుందోననే ఆందోళన ఈ ప్రాంత వాసుల్లో వ్యక్తమవుతోంది. ఎందుకంటే గోదావరి అత్యధికసార్లు మహోగ్రరూపం దాల్చి ప్రవహించింది ఆగస్టు నెలలోనే. 1953 నుంచి 2024 వరకు గోదావరి ఆగస్టు నెలలో 18సార్లు తుది ప్రమాద హెచ్చరిక 53 అడుగులు దాటి ప్రవహించింది. ఇందులో ఏడుసార్లు 60 అడుగులు దాటి మహోగ్రరూపం దాల్చింది. దీంతో వర్షాకాలం, వరదల సమయంలో ఏ క్షణాన (మిగతా 6వ పేజీలో)

ఆగస్టులో గోదావరి 60 అడుగులు దాటి ప్రవహించిన సందర్భాలివే..

సంవత్సరం	నెల-తేదీ	నీటిమట్టం (అడుగుల్లో)
1986	ఆగస్టు 16	75.6
1990	ఆగస్టు 24	70.8
2006	ఆగస్టు 6	66.9
1983	ఆగస్టు 14	63.5
2013	ఆగస్టు 3	61.6
2020	ఆగస్టు 17	61.6
1962	ఆగస్టు 20	60

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలపై ఆర్థిక భారం పడకుండా మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోతుండటంతో పలు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. వాస్తవానికి ఆరోగ్యశ్రీ అమల్లో ఉన్న ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కార్డు, తెల్లరేషన్‌కార్డు ఉన్న పేదలకు ఈ పథకం కింద వైద్యంతో పాటు పరీక్షలు కూడా ఉచితంగా చేయాలి. కానీ కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల నుంచి యాంజియోగ్రామ్‌తో పాటు పలు పరీక్షలకు సొమ్ములు వసూలు చేస్తున్నారు. ఆ తర్వాత గుండెకు స్టెంట్లు వేయాల్సివస్తే తొలుత ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని చెబుతారు.. కానీ చివరకు అవి నాణ్యంగా లేవని, తమ వద్ద విదేశాల స్టెంట్లున్నాయని చెప్పి అదనపు సొమ్ములు గుంజుతున్నారు. ఇదిలా ఉంటే మూడు వాల్వ్‌లు మూతపడినప్పుడే ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలనే నిబంధనలున్నాయి.

ఆరోగ్యశ్రీకి..

వసూళ్ల రోగం!

- పలు ఆస్పత్రుల్లో మాయాజాలం
- రోగుల వద్ద సొమ్ములు తీసుకుంటున్న యాజమాన్యాలు
- ఈ వ్యవహారంలో ఆర్‌ఎంపీలే కీలకం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



ఖమ్మం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మంలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేసేందుకు ఏ ఆస్పత్రికి అనుమతిలేదు. ఆరోగ్యశ్రీలో రెండు స్టెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుంది. కానీ మూడు స్టెంట్లు అవసరమైన రోగులను హైదరాబాద్‌కు రిఫర్ చేయకుండా రెండు స్టెంట్లు అవసరమని చూపి.. మూడోది వేసి.. దాన్ని వేరొకరికి వేసినట్టు రికార్డుల్లో చూపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఏడాది క్రితం ఒక ఆస్పత్రిలో ఒకరికి మూడు స్టెంట్లు వేయడంతో అతడి పరిస్థితి విషమించింది. ఆ తర్వాత హైదరాబాద్ తరలించి కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఖమ్మంజిల్లాలో 18ప్రైవేటు, ఏడు ప్రభుత్వ ఆసుపత్రులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 15 ప్రైవేట్, 9ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ అమలవుతోంది. ఖమ్మం జిల్లాలో 4.11లక్షల కుటుంబాలు, భద్రాద్రి కొత్తగూడెంలో 2.93లక్షల కుటుంబాలు ఆరోగ్యశ్రీకి అర్హులుగా ఉన్నాయి. అయితే చాలామంది రోగులు ప్రైవేటు ఆసుపత్రుల వైపే మొగ్గు చూపుతుండటం, అది కూడా ఆర్‌ఎంపీల వస్తుండటంతో.. ఆరోగ్యశ్రీ అమలవుతున్న ప్రైవేటు ఆసుపత్రుల వారు కూడా రోగిని చేర్చుకునేందుకు అడ్వాన్సుగా రూ.50వేల వరకు తీసుకుంటున్నారు. ఆ తర్వాత ఆరోగ్యశ్రీ అమలుకాదని, అత్యవసరం అని చెప్పి భయందోళనకు గురి చేసి.. డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇక ఆరోగ్యశ్రీ బిల్లు మంజూరైన రోగుల నుంచి కూడా ఆరోగశ్రీలో ఇచ్చే సొమ్ము తక్కువని, తమకు ఎక్కు ఖర్చు వస్తోందంటూ కొంతమేర సొమ్ములువసూలు చేస్తున్నారు. ఆసుపత్రుల్లోని ఆరోగ్యశ్రీ సేవా కేంద్రాల్లో ఉంటున్నది తాత్కాలిక ఉద్యోగులు కావడంతో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు ఏమీ చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో కొందరు బాధితులు ఆరోగ్యశ్రీ అధికారులు ఫిర్యాదు చేస్తున్నా.. చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. పలు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు చేయాల్సి ఉన్నా.. అలా చేయకుండా వేరే ఆసుపత్రులకు పంపి అక్కడ చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు పొందిన వారికి ఏడాదిపాటు మందులు (మిగతా 6వ పేజీలో)



ప్రారంభిస్తున్న ఈవో రమాదేవి

భద్రాద్రి దేవస్థానంలో

ఈ-ఆఫీసు విధానం..

అమలుకు కసరత్తు.. ఫైనాన్సియల్ మాడ్యూల్‌ను ప్రారంభించిన దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఈ-ఆఫీసు విధానం అమలుకు కసరత్తు ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని ప్రధాన ఆలయాల్లో ఈ-ఆఫీసు విధానం అమలు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు ఆదేశించారు. ఈ క్రమంలో ఇప్పటికే హైదారబాద్‌లోని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఈ ఆఫీసు విధానంను సైతం అమలు చేస్తున్నారు. ఈ తరుణంలో భద్రాచలం దేవస్థానం ఈ-ఆఫీసు విధానాన్ని అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ నెల రోజుల్లో పూర్తి చేసేందుకు అధికార వర్గాలు చర్యలు చేపడుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని ఏ దేవస్థానంలో లేని విధంగా భద్రాద్రి దేవస్థానంలో డిజిటలైజేషన్ , బార్‌కోడింగ్, ఉచిత అన్నదానంకు కంప్యూటర్ టోకెన్లు, కియాస్క్‌తో పాటు ఇతరత్రా సాంకేతిక పద్ధతులను అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఖాతాలన్నిటిని ఆన్‌లైన్ ద్వారా ఫైనాన్సియల్ మాడ్యుల్ క్రియేట్ చేసి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం (మిగతా 6వ పేజీలో)



స్వగృహను దక్కించుకునేందుకు...

- టెండర్లకు ప్రయత్నాలు చేస్తున్న ఉద్యోగ సంఘాలు
- రేపు రాజీవ్ స్వగృహ ప్రాంగణంలో సమావేశం

ఖమ్మం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : దశాబ్దానికి పైగా అసంపూర్తిగా ఉన్న రాజీవ్ స్వగృహ భవన సముదాయానికి ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ చేపట్టడంతో జిల్లాలోని టీజీవో, టీఎన్‌జీవోతోపాటు రిటైర్డు ఉద్యోగులు ఆ భవనాలను టెండర్లలో దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లి రాజీవ్‌స్వగృహ ఆవరణలో సమావేశం నిర్వహించబోతున్నారు. టెండర్లలో పాల్గొనే ముందు రూ.5కోట్లు డిపాజిట్ చెల్లించాల్సి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 2007లో వైఎస్ఆర్ హయాంలో ఈ భవనాలకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు తర్వాత రాష్ట్ర విభజన అనంతరం బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో రాజీవ్ స్వగృహ పనులు అసంపూర్తిగా వదిలేశారు. ప్రారంభంలో రూ.70కోట్లతో ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చేందుకు వారి నుంచి రూ.3500తీసుకుని దరఖాస్తులు స్వీకరించారు. అయితే ఎక్కువమంది అప్పట్లో రాజీవ్‌స్వగృహను తీసుకునేందుకు ముందుకు రాలేదు. తాజాగా ప్రభుత్వం రూ.87.41కోట్లు కనిష్ఠ ధరగా నిర్ణయించి టెండర్లు ఆహ్వానించింది. స్క్వేర్‌ఫీట్ రూ.1150గా నిర్ణయించి.. సెప్టెంబరు 6 సాయంత్రం 5గంటల్లోపు దరావత్ చెల్లించాలని సూచించింది. సెప్టెంబరు 8 ఉదయం 11:30గంటలకు లాటరీ నిర్వహిస్తారు. అయితే ఈభవనాలు పూర్తికావాలంటే మళ్లీ సగం నిధులు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు,రిటైర్డు ఉద్యోగులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని రాజీవ్ స్వగృహ సముదాయం పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆదివారం జరిగే సమావేశంలో ఉద్యోగులు అధికారులతో చర్చించి సభ్యులనుంచి డిపాజిట్ సొమ్ము స్వీకరించే అవకాశం ఉంది. గేటెడ్ కమ్యూనిటీ తరహాలో రాజీవ్ స్వగృహ ప్లాట్లను పూర్తిచేసేందుకు ఉద్యోగ సంఘాలు ఇప్పటికే నిర్ణయించాయి.

ప్రతీ ఒక్కరికి సమాచారం

తెలుసుకునే హక్కు

- ఆర్టీఐ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాసరావు, కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న సమాచార హక్కు కమిషనర్ శ్రీనివాసరావు, పక్కన కమిషనర్ భూపాల్, కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉందని ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. అందువల్ల ఆర్టీఐ చట్టాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార శాఖ అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం కమిషనర్లు పీ.వీ. శ్రీనివాసరావు, భూపాల్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో పాటు ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీ శ్రీనివాసరావు, కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. రెండేళ్లకు పైగా ఆర్టీఐ కమిషన్ లేని కారణంగా 15 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అందువల్ల ప్రస్తుతం పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో ఆర్టీఐ కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్టీఐ చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తే అనవసరపు అనుమానాలకు తావు ఉంటుందన్నారు. దరఖాస్తులను సకాలంలో డిస్పోజ్ చేయడం ద్వారా ప్రజలలో ఉన్న అనుమానాలు తీరిపోతాయన్నారు. ప్రపంచంలో భారత దేశం సమాచార హక్కు చట్టం అమలులో 8వ స్థానంలో ఉందన్నారు. ఆర్టీఐ చట్టంపై అధికారులకు అవగాహన కల్పించి పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ప్రతీ అధికారి తన హక్కులు, బాధ్యతలతో పాటు చట్టపరంగా పాటించాల్సిన మార్గదర్శకాలను తెలుసుకొని సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఆర్టీఐ కమీషనర్లు అందించిన సూచనలు, సలహాలను ఖమ్మం జిల్లాలోని ప్రజా సమాచార అధికారులు తూచ తప్పకుండా పాటించాలన్నారు. చిన్న చిన్న కారణాల వల్ల సమాచారం ఇవ్వని కేసులను త్వరగా డిస్పోజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయడం ద్వారా పాలనలో పారదర్శకత ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రజా సమాచార అధికారి తప్పుడు సమాచారం అందించినా, ఆలస్యం చేసినా ఆర్టీఐ చట్టం ప్రకారం కమిషన్ వారిపై చర్యలు తీసుకోవచ్చునన్నారు. ఆర్టీఐ చట్టం నిబంధనలను ప్రతీ అధికారి పాటించాలన్నారు. అనంతరం ఆర్టీఐ కమిషనర్లు వివిధ శాఖలలో ఉన్న పెండింగ్ కేసులపై ఆయా శాఖల అధికారుల నుంచి అప్పీళ్లను స్వీకరించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్‌వో పద్మశ్రీ, పౌర సమాచార శాఖాధికారులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో..

తీరని విషాదం

- ముగ్గురిని మింగిన కట్టలేరు
- చేపల వేటకు వెళ్లి గల్లంతైన వారి మృతదేహాలు లభ్యం
- ఎర్రుపాలెం మండలం బంజరగ్రామంలో ఘటన

7

కుర్నవల్లి సొసైటీ

పాలకవర్గం రద్దు

- ఛైర్మన్, కార్యదర్శుల నుంచి రూ.1.06కోట్ల రికవరీకి ఆదేశం
- మంత్రి తుమ్మల సూచనలతో అవినీతి అక్రమాలపై అధికారుల కొరడా

6

శోభాయమానంగా

స్తంభాద్రి గిరి ప్రదక్షిణ

నృసింహుడి వేడుకకు పెరుగుతున్న ఆదరణ



స్వామివారికి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు 7

అమల్లోకి

కొత్త రూల్

- ఫేస్ రికగ్నేషన్ విధానంలో టీచర్ల హాజరు నమోదు
- తొలి రోజు జిల్లాలో 3,800మంది హాజరు
- పలుచోట్ల తలెత్తిన ఆన్‌లైన్ సమస్యలు
- డుమ్మా కొట్టే.. ఆలస్యంగా వచ్చే టీచర్లకిక చెక్

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విధులకు డుమ్మా కొట్టే.. ఆలస్యంగా వచ్చే ఉపాధ్యాయులకు చెక్ పెట్టేలా ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ విధానం(ఎఫ్‌ఆర్‌ఎస్) శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. అయితే తొలిరోజు పలు చోట్ల ఆన్‌లైన్ సమస్యలు ఎదురవగా రెండు, మూడు రోజుల్లో వాటిని పరిష్కరించి పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 5,600 మంది ఉపాధ్యాయులు ఉండగా.. శుక్రవారం 3,800మంది ఈ ఫేస్ రికగ్నేషన్ విధానాన్ని ఉపయోగించి హాజరు నమోదు చేశారు. ఇందులో కొన్ని డబుల్ రిజిస్టర్ అయి.. మరికొన్ని అసలు రిజిస్టరే కాలేదు. యాప్‌లో విద్యార్థుల హాజరు నమోదు, ఉపాధ్యాయుల నమోదు ఒకేసారి కావడంతో.. ఆన్‌లైన్ సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో ఆయా ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లాలోని తిరుమలాయపాలెం, (మిగతా 8వ పేజీలో)

మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

» ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై జరుగుతున్న నేరాలను అడ్డుకుని వారికి న్యాయం చేయడానికి వీలుగా ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ తరపున టీజీడబ్ల్యూఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేకమైన విభాగమే షీటీమ్స్ అని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని చుంచుపల్లిలో గల షీటీమ్స్, ఎహెచ్‌టీయూ కార్యాలయాలను జిల్లా ఎస్పీ సందర్శించారు. ముందుగా షీ టీం, ఎహెచ్‌టీయూ కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. జిల్లా షీ టీమ్స్ 8712682131కి ఫోన్ చేసి తమ సమస్యని తెలియచేసుకోవచ్చని అన్నారు. ఫిర్యాదుచేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, ఫిర్యాదు అందుకున్న వెంటనే నేరస్తుడ్ని షీ టీం కార్యాలయానికి పిలిచి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పరిస్థితిని బట్టి నిందితుడిప కేసు నమోదు చేయడం జరుగుతుందని, బాలికలకు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిర్భయంగా షీ టీమ్స్‌ను సంప్రదించాలని తెలిపారు. జనాలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో, రైల్వేస్టేషన్, బస్టాండ్లు, కళాశాలల వద్ద షీ టీమ్స్ సభ్యులు నిరంతరం సంచరిస్తూ ఆకతాయిల ఆగడాలను నిరోదిస్తూ మహిళలకు అండగా నిలవాలని సూచించారు. మానవ అక్రమ రవాణా చేసి వారి అవయవాలను విక్రయించడం, వారితో వెట్టిచాకిరి చేయించడం, వ్యభిచారంలోకి లాగడం, బాల్య వివాహాలు చేయడం లాంటివి జరగకుండ ఎహెచ్‌టీయూసిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఇటువంటినేరాలు జరగకుండ ఉండటానికి నిరంతరం జిల్లా మొత్తం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేయాలనితెలిపారు. మఫ్టీ దుస్తుల్లో సంచరిస్తూ నేరాలు జరగడానికి అవకాశం ఉండే ప్రదేశాల్లో ఎహెచ్‌టీయూ, షీటీం సిబ్బంది నిరంతరం సంచరిస్తూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సీఐ రాము, ఎఎస్ఐ నాగయ్య, షీటీం సభ్యులు మల్లికాంబ, రాంబాబులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణ బీమా

- సహజ మరణానికి బీమా వర్తింపు
- మొత్తం ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం
- ఏడాదిలో 14మంది ఎస్‌హెచ్‌జీ సభ్యుల కుటుంబాలకు ఊరట
- రూ.13.75లక్షల రుణమాఫీకి మెప్మా పీడీ అభిషేక్ అగస్త్య ఆమోదం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరిన మహిళలు, వారి కుటుంబాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం మరో పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు రుణబీమా పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. అయితే ఈ పథకంపై మహిళ సంఘాలకు ఇంకా పూర్తిగా అవగాహన రాలేదు. అయినా ఖమ్మం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్య, శ్రీనిధి అధికారులు సమన్వయంతో ఖమ్మం జిల్లాలో మున్సిపాలిటీల్లోని 14 మంది బాధిత మహిళా కుటుంబాలకు ఆర్థిక రుణ బీమా వర్తింపుకు కార్యచరణ చేశారు. ఈ మేరకు శుక్రవారం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అమోదం తెలిపారు. 2024నుంచి ఈ రుణ బీమా అమల్లోకి రాగా.. ఖమ్మం జిల్లాలో గతేడాది రూ.100కోట్ల వరకు మెప్మా ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందించారు. వాటిలో 300మంది సభ్యుల వరకు రూ.2లక్షల లోపు రుణాలను తీసుకున్నారు. ఇలా రుణాలు పొందిన వారిలో ఖమ్మం నగర పాలక సంస్థలో ఐదుగురు, సత్తుపల్లి మున్సిపాలిటీలో ఐదుగురు, వైరా మున్సిపాలిటీలో 1, మధిర మున్సిపాలిటీలో ముగ్గురు మొత్తం 14మంది రూ.2లక్షల రుణం తీసుకున్న వారు సహజ మరణం చెందారు. వీరు ఇంకా శ్రీనిధికి రూ13.73లక్షలు చెల్లించాల్సి ఉంది. దీంతో స్పందించిన మెప్మా పీడీ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య శ్రీనిధి రిజనల్ మెనేజరు రవీంద్రనాయక్, డీఎంసీ సావల సుజాత, ఏడీఎంసీ వెంకటేశ్వరరావు, టీఎంసీ గుడిపూడి సుజాత రాణితో నివేదికలు తెప్పించుకొని రుణమాఫికి ఓకే చెప్పారు.

రూ.2లక్షల లోపున్న వారికి....

రాష్ట్ర ప్రభుత్వం, పట్టణ పేదరిక నిర్మూలన పర్యవేక్షణలో శ్రీ నిధి ద్వారా మహిళ స్వయం సహాయక సంఘాలకు రుణాలను మంజూరు చేస్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 నుంచి రూ.2లక్షల లోపు రుణాలను తీసుకునే వారికి ఈ బీమా వర్తింపు పథకాన్ని ప్రవేశ పెట్టింది. బీమాకు సంబంధించిన ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న మహిళ సంఘం



లోని సభ్యురాలెవరైనా సహజ మరణం లేదా మరే కారణంతో మరణించినా కూడా తీసుకున్న రుణంలో మిగిలిన మొత్తం మాఫీ అవుతుంది. ఆ మహిళ పేరుతో ఉన్న శ్రీనిధి బకాయిలను మృతురాలి కుటుంబ సభ్యులు చెల్లించాల్సిన అవసరం లేదు. పైసా ఖర్చు లేకుండా శ్రీనిధి బకాయిలకు ఇంకా చెల్లించాల్సిన అప్పును బదలాంపు చేసి మరణించిన సభ్యురాలి కుటుంబానికి ఆర్థిక భారం కాకుండా ఆదుకుంటారు. ఇలా చేయటంతో ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులకు మహిళ సంఘాల అప్పుల నుంచి ఊరట కలుగుతుంది.

గ్రామగ్రామాన ఆదివాసీ దినోత్సవాలు జరపాలి

ఇల్లెందురూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ గూడాలలో, గ్రామగ్రామాన ఆదివాసీ జెండాలను ఎగరవేసి వేడుకలు జరపాలని ఆల్‌ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ మూక్తి సత్యం పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆగస్టు9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ముందు అన్ని గూడాలలో ఆదివాసులను సమయత్తం చేయాలని కోరారు. ఆదివాసుల పక్షాన ఆల్‌ఇండియా ట్రైబల్ ఫోరం ఎప్పుడు అండగా ఉంటుందని వివరించారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సుర్ణపాక నాగేశ్వరావు, మోకాళ్ల మురళికృష్ణ, గుగులోత్ సక్రు, చింత రజిత, మోకాళ్ల రమేష్, ఇర్పా రాజేష్, గురువమ్మ తదితరులుపాల్గొన్నారు.

కళాకారిణి సుమిత్రకు అభినందన



సుమిత్రను అభినందిస్తున్న వనమా

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): కళాకారిణి సుమిత్రను మాజీ మంత్రి వనమ వెంకటేశ్వరరావు శుక్రవారం అభినందించారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన కళాకారిణి సుమిత్ర ఈ ఏడాది మార్చి నెలలో ఆర్ట్స్ అండ్ కల్చరల్ విభాగంలో ఆగ్రాలో డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

సామ్యాతండా గిరిజన పాఠశాలకు విద్యార్థులు



విద్యార్థులను పాఠశాలలో చేరుస్తున్న అధికారులు

చంద్రుగొండ, అగస్టు 1(ఆంధ్రజ్యోతి): జీరో హాజరు శాతంతో కొనసాతున్న మండలంలోని సామ్యాతండా గిరిజన పాఠశాలలో శుక్రవారం తిరిగి విద్యార్థులు చేరారు. గత విద్యా సంవత్సరం నుంచి పాఠశాలకు ఒక్క విద్యార్థి కూడా హాజరు కావడంలేదు. దాంతో ఈ అగస్టు నెలలో ఈ పాఠశాలను వేరే పాఠశాలలో విలీనం చేయాలని ఐటీడీఏ అధికారులు నిర్ణయించారు. గతంలో అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన అదే పంచాయతీకి చెందిన ఇస్లావత్ వీరన్న గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విదార్థులను పాఠశాలో చేర్పించేందుకు ఒప్పించారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలపడంతో ఏసీఎంవో కే రమేష్, ఎస్‌సీఆర్‌పీ హరిలాల్ గ్రామానికి చేరుకొని మరోసారి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి ఎనిమిది మంది పిల్లలను పాఠశాలలో చేర్పించారు.

పొలంబాట పట్టిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



కూలీలతో కలిసి నాట్లు వేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పొలంబాట పట్టారు. శుక్రవారం టేకులపల్లి మండల పర్యటనలో భాగంగా బేతంపూడి గ్రామంలో ఇల్లెం దు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి ఉన్నపొలాల్లో వరినాట్లు వేస్తుండగా పొలంలోకి వెళ్లి రైతు కూలీ అక్కా చెల్లెమ్మలతో నాట్లు వేశారు. అక్కడే అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వారి వద్దనే ఉన్న భోజనం చేశారు. వరిపొలంలో వరినాటుతోపాటు కూలీలతో కలిసి ఆడిపాడారు. అకస్మాతుగా ఎమ్మెల్యే కోరం కనకయ్య తమ వద్దకు వచ్చి వరి పొలంలో నాట్లు వేయడంతో కూలీలు ఉబ్బితబ్బిపోయారు. ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, అధికారులు ఉన్నారు.

రెండు తలలతో గొర్రెపిల్ల జననం



బోనకల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయనపేట గ్రామంలో శుక్రవారం రామడుగు శేషగిరిరావు ఇంట్లో రెండు తలల గొర్రె పిల్ల జన్మించింది. శేషగిరిరావు పెంచుకుంటున్న గొర్రె రెండో ఈతలో ఆడ గొర్రె పిల్ల జన్మించగా.. అది రెండు తలలతో పుట్టడంతో స్థానికులు వింతగా చూస్తున్నారు. అయితే ఆ పిల్ల కష్టంగా పాలు తాగుతోందని, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతోందని రైతు తెలిపారు. రెండు తలల గొర్రెపిల్ల జననంపై పశువైద్యాధికారిని సంప్రదించగా జన్యు లోపం వల్ల ఇలా జరుగుతుందని, అది బతకడం కష్టంగానే ఉంటుందని తెలిపారు.

కుర్నవల్లి సొసైటీ పాలకవర్గం రద్దు

» చైర్మన్, కార్యదర్శుల నుంచి రూ.1.06 కోట్ల రికవరీకి ఆదేశం



తల్లాడ, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): సొసైటీలో ఆర్థిక అక్రమాలు, నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లోపంతో రైస్‌మిల్లు నిర్మాణంలో అవకతవకలు జరిగిన నేపథ్యంలో తల్లాడ మండలం కుర్నవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) పాలకవర్గం రద్దయిం ది. ఈమేరకు జిల్లా సహకార శాఖ అధికారి జి.గంగాధర్ ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డితోపాటు పాలకవర్గం రద్దు కావడంతో సొసైటీ కార్యకలాపాలు నిర్వహించేందుకు పర్సన్ ఇన్‌చార్జిగా డీసీసీబీ తల్లాడ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.శ్రీనివాసకుమార్‌ను నియమించారు.. శుక్రవారం కుర్నవల్లి సొసైటీ కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జిగా శ్రీనివాసకుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.

దుర్వినియోగమైన రూ.1.06 కోట్లను చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి, కార్యదర్శి ఒగ్గు నరసింహారెడ్డిల నుంచి రికవరీ చేయాలని, ప్రదీప్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సొసైటీ ఆర్థిక అక్రమాలతోపాటు సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన రైస్‌మిల్లు నిర్మాణంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈదశలో ఈఏడాది ఏప్రిల్ 13న ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి నిర్మాణంలో ఉన్న రైస్‌మిల్లు షెడ్డు కుప్పకూలింది. రైస్‌మిల్లు నిర్మాణంలో నాణ్యతలోపం అవకతవకలు జరిగాయని కొందరు స్థానిక రైతులు మంత్రి తుమ్మలకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు డీసీసీబీ జిల్లా రిజిస్ట్రార్ ఎ.శ్రీనివాస్ విచారణ నిర్వహించారు. విచారణలో ముందుగా రూ.2.50కోట్లు అంచనా వ్యయంతో సొసైటీ రైస్‌మిల్లు నిర్మాణం చేపట్టి, సరైన డాక్యుమెంటేషన్ లేకుండా రూ.4.54 కోట్లు అంచనాను పెంచడం, ఇంత పెద్ద ఎత్తున ప్రాజెక్టుకు అవసరమైన దార్శనికతను సొసైటీ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, కార్యదర్శి నరసింహారెడ్డి ప్రదర్శించలేదని, సమర్థ ఏజెన్సీ సంప్రదించకుండా రైస్‌మిల్లును నిర్మించడంలో అనుభవమున్న సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించకుండా, నాణ్యతా లోపించి రైస్‌మిలుల షెడ్ కూలిపోయిందని నివేదిక సమర్పించారు. దీంతో తొలి వేటు కార్యదర్శి ఒగ్గు నరసింహారెడ్డిపై పడింది. ఈఏడాది మే 30న కార్యదర్శి నరసింహారెడ్డిని సస్పెండ్ చేశారు. ప్రస్తుతం సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డితోపాటు పాలకవర్గాన్ని రద్దుచేసిన పర్సన్ ఇన్‌చార్జిను నియమించారు. ఆరున్నదర దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన కుర్నవల్లి సొసైటీ చరిత్రలో అవినీతి అక్రమాల నేపథ్యంలో సొసైటీ పాలకవర్గం రద్దుకావడం చర్చనీయాంశమైంది.

ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారిగా జడ్పీ డిప్యూటీ సీఈవో ?

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారిగా ఖమ్మం జడ్పీ డిప్యూటీ సీఈవో నియమించేందుకు కలెక్టర్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. దీనిపై విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిసింది. శనివారం అధికారికంగా ఉత్తర్వులు రానున్నాయి. ప్రస్తుత డీఈవో సత్యనారాయణ గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. రెండు రోజులుగా డీఈవోగా అధికారులు ఎవరిని నియమించలేదు. ప్రస్తుతం ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నత్తులు నడుస్తున్న సమయంలో డీఈవోగా ఎవరు లేకపోవటంతో కలెక్టర్ జడ్పీ డిప్యూటీ సీఈవోకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగిస్తారని తెలిసింది.

ఒకే వ్యక్తికి ఒకే రోజు రెండు నియామకాలు !

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం విద్యాశాఖ కార్యాలయంలో ఓవిభాగంలో కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తికి జూలై 31న నగరంలోని ఓ ఉన్నత పాఠశాలకు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆవెంటనే డిప్యూటేషన్‌పై మళ్లీ అదే కార్యాలయంలో కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా కోఆర్డినేటర్‌గా రాష్ట్ర ఉన్నతాధికారులు నియమించగా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే ఉత్తర్వులు జారీచేయటంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జూలై 31న జిల్లా విద్యాశాఖ అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన అధికారి ఈ రెండు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

కేయూ దూరవిద్య ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (గతంలో ఎస్‌డీఎల్‌సీఈ)లో డిగ్రీ, పీజీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఈనెల11 వరకు పొడిగించినట్లు యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్‌సీ మ్యాథ్స్, బ్యాచలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. పీజీ కోర్సులు, డిప్లమా కోర్సుల్లో పాటు మొత్తం 43 కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఫీజు, అర్హతలు తదితర వివరాలకు అధ్యయన కేంద్రం సెల్‌నెంబర్ 8008811998 సంప్రదించాలని చెప్పారు.

ఆరోగ్యశ్రీకి వసూళ్ల రోగం!

(5వ పేజీ తరువాయి)

ఉచితంగా ఇవ్వడంతో పాటు శస్త్రచికిత్సలు అనంతరం ఆధార్ కార్డు ఆధారంగా తిరిగి వెళ్లేందుకు బస్సు, రైలు చార్జీలు కూడా ఇవ్వాలి. కానీ ఇవేమీ అమలుకావడంలేదు.

కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు.. విచారణకు ఆదేశం

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడేనికి చెందిన యరమల జ్యోతిరాజు ఛాతినొప్పితో ఇటీవల ఖమ్మంలోని ప్రసన్న ఆర్థోపెడిక్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో చేరారు. రాత్రి కావడం, ఎమర్జెన్సీ కావడంతో యాంజియోగ్రామ్ చేసి స్టెంట్లు వేశారు. ఈ క్రమంలో అతడికి తెల్లరేషన్‌కార్డు ఉన్నా ఆరోగ్యశ్రీ వర్తించే అవకాశం ఉన్నా అతడి నుంచి రూ2.20లక్షలు వసూలు చేశారు. దాంతో బాధితుడు ఖమ్మం కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడంతో .. విచారించి నివేదిక ఇవ్వాలని జిల్లా రాజీవ్ ఆరోగ్యశ్రీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

విచారణ చేసి నివేదిక ఇస్తాం

ప్రసన్న ఆర్థోపెడిక్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ అమల్లో ఉన్నా.. డబ్బులు తీసుకున్న దానిపై రోగి ఇచ్చిన ఫిర్యాదుపై విచారించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బాధిత రోగి కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడంతో విచారణ చేయాలని కలెక్టర్ నుంచి తమకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఆరోగ్యశ్రీ నిబంధనలు పాటించిని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామన్నారు.

భద్రాద్రి దేవస్థానంలో ఈ-ఆఫీసు విధానం

అమలుకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

ఈవో ఎల్.రమాదేవి శుక్రవారం ప్రారంభించారు. భవిష్యత్‌లో ఆర్థికపరకమైన వ్యవహారాల్లో ఎలాంటి అవకతవకలు, పొరపాట్లు ,లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఆఫీసు విధానం సైతం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకుంటే భద్రాద్రి దేవస్థానంలో పూర్తి పారదర్శకతకు అవకాశం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టే వివిధ రకాల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, అంచనాలు, కార్యాలయ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. కాగా భద్రాచలం దేవస్థానంలోని సెంట్రల్ స్టోర్‌లో సైతం ఈ స్టోర్‌ను త్వరలో అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

భూ వివాదంలో..
పత్తి పంట ధ్వంసం



ధ్వంసమైన పత్తిపంట

కారేపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవింద్‌తండాలో భూ వివాదంలో పత్తిపంటను ధ్వంసం చేశారు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గోవిందతండాకు చెందిన బర్మావత్ భద్రు, బర్మావత్ రాందాస్ వరసకు సోదరులు.. 1998లో బర్మావత్ భద్రు తనకున్న రెండు ఎకరాల్లో కుటుంబ అవసరాలకు ఎకరం రాందాస్‌కు విక్రయించాడు. సాదాబైనామా పట్టా చేయించుకోవాటానికి లింక్ డ్యాక్‌మెంట్ కావాలని భద్రును రాందాస్ కోరాడు. దీంతో భద్రు తాను గతంలో 2ఎకరాలు కొనుగోలు చేసిన లింక్ డ్యాక్‌మెంట్‌ను ఇచ్చాడు. ఇదే అదునుగా చేసుకున్న రాందాస్ ఆలింక్ డ్యాక్‌మెంట్‌తో తాను కొనుగోలు చేసిన ఎకరంతోపాటు భద్రుకు చెందిన ఎకరం భూమిని కుడా తనపేరుపై పట్టా చేయించుకున్నాడు. రైతుబంధు కూడా పొందుతున్నాడు. గ్రామంలో ఎవరితోను సఖ్యత ఉండని భద్రు ఆ ఊరి నుంచి పక్కగ్రామం అయిన చీమల వారిగూడెంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో భద్రు సాగుచేస్తున్న భూమిపై హక్కు తనకే ఉందని గురువారం అర్ధరాత్రి పత్తి పంటను ట్రాక్టర్‌తో ధ్వంసం చేశాడు. శుక్రవారం ఈ విషయాన్ని గమనించిన భద్రు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ, ఎస్‌ఐలు ధ్వంసం పంటను పరిశీలించారు.

ఆగస్టులో గోదా'వర్రీ'!

(5వ పేజీ తరువాయి)



1986 ఆగస్టు 16న భద్రాచలం వద్ద నీట మునిగిన రామాలయ పరిసరాలు(ఫైల్)

ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ నదీ పరివాహక ప్రాంత వాసులు ఆందోళన చెందుతూ ఉంటారు. 2022, జూలై 17 నుంచి ఆగస్టు 17 వరకు నెల రోజుల పాటు దాదాపుగా 50 అడుగుల నీటిమట్టం పైనే గోదావరి ప్రవాహం సాగిందంటే.. పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరి ఈసారి ఆగస్టు నెలలో గోదావరి ప్రవాహం ఏ విధంగా సాగుతుందో వేచి చూడాల్సి ఉంది.

● 1986 ఆగస్టు 16న ఏం జరిగిందంటే..

1986, ఆగస్టు 16న భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 75.6 అడుగులుగా నమోదైంది. భద్రాద్రి చరిత్రలో ఇంత భారీ వరదలు గతంలో, ఇప్పటి వరకు రాలేదు. అయితే ఆ రోజున వరదల ధాటికి భద్రాచలం పట్టణంలోని రామాలయ పరిసరాలు, చప్టా దిగువ, బ్రిడ్జి సెంటర్, శిల్పినగర్, అశోకనగర్, సుభాష్‌నగర్ తదితర కాలనీలు నీట మునిగాయి. అంతే కాదు అప్పటి భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కూనవరం, చింతూరు, వరరామచంద్రాపురం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలు పూర్తిగా నీట మునిగాయి. రహదారులపై రాకపోకలు స్తంభించాయి. చివరికి ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సైతం వరద ముంపులోనే అప్పటి అధికార యంత్రాంగం నిర్వహించిన పరిస్థితులు తలెత్తాయి. అప్పటి గోదావరి ఉగ్రరూపం చూసిన వారు ఇప్పటికీ వరదలంటే నాటి వరదలనే పేర్కొంటూ ఉంటారు. గత ఏడు దశాబ్దాల్లో అధికసార్లు ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయాన గోదావరికి వరద తీవ్రత అధికంగా ఉంటూ వస్తోంది. ఇదిలా ఉండగా.. ఆగస్టు నెలలో నదీ పరివాహక ప్రాంతవాసులను భయాందోళనకు గురి చేస్తున్న గోదావరి అతి స్వల్పంగా వచ్చిన సందర్భాలు సైతం లేకపోలేదు. తొలి ప్రమాద హెచ్చరిక 43 అడుగులు కూడా రాని సందర్భాలు ఉన్నాయి. 1982, ఆగస్టు 12న గోదావరి ఆగస్టు నెలలో అత్యల్పంగా 34.4 అడుగుల నీటిమట్టం నమోదైంది. 2004, ఆగస్టు 6వ తేదీన 36.7 అడుగులు, 1974 ఆగస్టు 12న 40.4, 1968 ఆగస్టు 18న 41 అడుగులు కనిష్ఠ నీటిమట్టంగా ఆగస్టు నెలలో నమోదైంది.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

భద్రాద్రి జిల్లాను సందర్శించిన రాష్ట్ర ఆయూష్ డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు



రోగితో మాట్లాడుతున్న ఆయూష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులను ముందస్తుగా గుర్తించి వాటిని అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర ఆయూష్ డైరెక్టర్ జి.శ్రీకాంత్ బాబు సూచించారు. శుక్రవారం కొత్తగూడెం సర్వజన జనరల్ హాస్పటల్ (జీజీహెచ్) పాల్వంచలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ (సీహెచ్‌సీ), చంద్రుగొండ పీహెచ్‌సీలను సందర్శించారు. ఆరోగ్య సౌకర్యాలను సందర్శించి పరిశీలించారు. సీజనల్ వ్యాధులను ఎదుర్కొవడానికి వైద్య ఆరోగ్య సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బందికి ఉన్నత ప్రమాణాల సంరక్షణ, రోగి సేవలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎస్.జయలక్ష్మి, సూపరింటెండెంట్ రాధామోహన్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్ పి. స్పందన, డాక్టర్ బి. పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్యను దర్శించిన ఆయుష్ డైరెక్టర్

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ జి.శ్రీకాంత్‌బాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ప్రాశస్యం విశిష్టతను వైదిక సిబ్బంది వివరించారు. శ్రీకాంత్‌బాబుకు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి., ఆయుష్ భద్రాద్రి జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు,డీపీఎం మహేష్‌గౌడ్ జ్ఞాపికను అందజేశారు.

హెల్త్ క్యాంపులు నిర్వహించాలి

భద్రాద్రి అదనపు డీఎంహెచ్‌వో

అశ్వాపురం ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఏజెన్సీ గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో కె.సైదులు అన్నారు. శుక్రవారం ఆయన అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలో రోగులకు అందుతున్న సేవలు, ఆసుపత్రికి సంబంధించిన అన్నీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు సంకీర్తన, శివకుమార్, పాయం శ్రీను, హెచ్‌ఈవో లింగకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సైదులు

శోభాయమానంగా స్తంభాద్రి గిరి ప్రదక్షిణ

స్తంభాద్రి నృసింహుడి వేడుకకు పెరుగుతున్న ఆదరణ


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్త బృందం


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఆలయ అర్చకులు, అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్వయంబూ దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ఖమ్మంలోని స్తంభాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి (గుట్ట) 9వ గిరి ప్రదక్షిణ శుక్రవారం శోభాయమానంగా జరిగింది. ఈ గిరి ప్రదక్షణకు ప్రతినెలా భక్తుల ఆదరణ పెరుగుతోంది. ఆలయ అర్చక బృందం, దేవాదాయ శాఖ అధికారులు, భక్త బృందాల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షణ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు, దేవాదాయ శాఖ అధికారులు, భక్తబృందాల ఆధ్వర్యంలో స్వామి వారి గిరి ప్రదక్షిణ సాగింది. సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు గిరి ప్రదక్షిణ జరగగా.. ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. లోక కళ్యాణార్థం ప్రతి నెలా స్వామివారి జన్మ నక్షత్రం రోజున స్థంభాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో, అర్చక బృందం తెలిపింది. ఫిబ్రవరి 18న మొదటిసారి ప్రారంభించిన గిరి ప్రదక్షిణ నుంచి శుక్రవారం జరిగిన 7వ గిరి ప్రదక్షిణ వరకు భక్తుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని ఆలయ ఈవో తెలిపారు. సుమారు రెండు కిలోమీటర్ల వరకు గిరి ప్రదక్షిణ జరుగుతుండగా.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు. ప్రదక్షణ అనంతరం కొండపై ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి స్వాతి నక్షత్ర జ్యోతిని వెలిగించగా.. భక్తులు దివ్యజ్యోతి దర్శనం చేసుకున్నారు.

బొగ్గు ఉత్పత్తిలో
ఇల్లెందు ఏరియా వెనుకంజ

ఇల్లెందు టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఇల్లెందు ఏరియా జూలై నెలలో బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడిపోయింది. ఇల్లెందు ఏరియాకు నిర్దేశించిన 2.13లక్షల టన్నులకు గాను 1.33 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశారు. కేవలం 62శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి సాధించారు. ఉత్పత్తి అయిన బొగ్గును వివిధ మార్గాల్లో రవాణా చేసినట్లు ఏరియా జీఎం వి.కృష్ణయ్య తెలిపారు. నిర్ధేశించిన లక్ష్యంలో కేవలం 62శాతం సాధించడం పట్ల శుక్రవారం జీఎం వివరాలను వెల్లడించారు. జూలై నెలలో 3 రేకుల ద్వార బొగ్గు రవాణా జరిగిందని, వార్షిక లక్ష్యంలో ముందంజలో ఉన్నట్లు ప్రకటించారు. బొగ్గు ఉత్పత్తి సాధించిన ఏరియా ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకులను జీఎం అభినందించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ఆయుష్ డైరెక్టర్


వైద్యులతో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీకాంత్‌బాబు

చంద్రుగొండ, అగస్టు 1(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించేందకు కృషి చేయాలని రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ పి.శ్రీకాంత్‌బాబు స్థానిక వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులు, వైద్యసేవలు, మందుల నిల్వ రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులు తనుజా, వెంకట ప్రకాష్, మిగతా అధికారులతో సమావేశమై సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా మందుల కొరత, ఆస్పత్రిలో నెలకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు 'క్షయవ్యాధి' జిల్లా అధికారి పుల్లారెడ్డి, 'మలేరియా' జిల్లా అధికారి స్పందన తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి మెమో

దుమ్ముగూడెం ఆగష్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ములకపాడు పంచాయతీ కార్యదర్శి వి.రాధాకృష్ణకు మండల పంచాయతీ అధికారి రామకృష్ణ శుక్రవారం మెమో జారీ చేశారు. గత నెల 31న ములకపాడు గ్రామపంచాయతీలో మద్యం దుకాణాలకు సంబంధించిన పీసా గ్రామసభ నిర్వాహణపై తనకు సమాచారం ఇవ్వకపోవడంపై వివరణ కోరుతూ మెమో ఇచ్చారు. గడువు తేదీలోగా వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 8 వరకు హైదరాబాద్‌లో యువ తెలంగాణ కబడ్డీ చాంపియన్‌షిప్ నిర్వహించనుంది. ఈ పోటీల్లో పాల్గొనే జట్లను రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి క్రిష్ణవర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను 8 జట్లుగా ఎంపిక చేసి రెండు గ్రూపులుగా విభజించి వారికి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి జట్టులో 23 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గల నలుగురు క్రీడాకారులు, 25 సంవత్సరాల కంటే తక్కువగా ఉన్న ముగ్గురు క్రీడాకారులు, 25 సంవత్సరాల కంటే ఎక్కువగా ఉన్న ఏడుగురు క్రీడాకారులను ఎంపిక చేస్తారని తెలిపారు. క్రీడాకారులు 85 కేజీల లోపు బరువు ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు శనివారం సాయంత్రం కల్లా తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7396669337 నెంబరును సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ కేసీఆర్ జాగీరు కాదు

టీడీపీ కొత్తగూడెం నియోజకవర్గ కన్వీనర్ కాపా కృష్ణమోహన్

పాల్వంచ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు, ప్రాంతాలకు, కులాలకు అతీతంగా అందరూ కలిసి పోరాడి తెచ్చుకున్నదని తెలంగాణ రాష్ట్రమని, అటువంటి తెలంగాణ కేవలం కేసీఆర్ ఒక్కరి జాగీరు కాదని టీడీపీ కొత్తగూడెం నియోజకవర్గ కన్వీనర్ కాపా కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బనకచర్ల వ్యవహారంలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే కూర్చుని చర్చించుకోవాలి తప్ప కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులు టీడీపీ నాయకులపై బురదచల్లే ప్రయత్నంచేస్తే సహించబోమని హెచ్చరించారు. సముద్రంలో కలిసే వృథా నీటిని ఆంధ్రా రాష్ట్రం వినియోగించుకుంటే తెలంగాణ రాష్ట్రానికి వచ్చే నష్టం ఏమిటో బీఆర్‌ఎస్ నాయకులు చెప్పాలన్నారు. కుటుంబంలో అంతర్గత కుమ్ములాటలు బహిర్గతమవుతాయనే భయంతోనే డైవర్షన్ కోసం బనకచర్ల వ్యవహారంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీపై భవిష్యత్తులో ఇదేధోరణి అవలంభిస్తే తెలంగాణలోని టీడీపీ శ్రేణులు బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు కళ్యాణం లక్ష్మీపతి, కత్తి శ్రీను, బత్తిని దుర్గారావు, ఘనేని బాబు, కొండపల్లి నాగయ్య, వడ్లమూడి పూర్ణ, అప్పారావు, మేదరమెట్ల నారాయణ, తలపనేని శ్రీనివాసరావు, వీరమాచినేని నరేష్, వెంకటేష్, తోటా కోటేశ్వరరావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో తుమ్మలను ఆదర్శంగా తీసుకోవాలి

ఆర్టీఐ కమిషనర్ అయోధ్యరెడ్డి
మంత్రి తుమ్మల పామాయిల్ క్షేత్రం సందర్శన


తుమ్మల వ్యవసాయక్షేత్రంలో పామాయిల్, అంతర పంటలను పరిశీలిస్తున్న కమిషనర్

దమ్మపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలని ఆర్టీఐ కమిషనర్ అయోధ్యరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తుమ్మల పామాయిల్ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలోని పామాయిల్ గెలలను అంతర పంటలుగా వేసిన కోకో మొక్కలను పరిశీలించారు. పామాయిల్ దిగుబడి, అంతరపంటల విధానం గురించి ఆయనకు కాసాని నాగప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా అయోధ్యరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చాలామంది రైతులు పామాయిల్ సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందారని, యాదగిరిగుట్ట, భువనగిరి, నల్లగొండ ప్రాంతాల్లో కూడా ఆయిల్‌పామ్ విస్తరించనున్న నేపథ్యంలో తానూ ఓ రైతుగా పామాయిల్ సాగు పరిశీలనకు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ అయోధ్యరెడ్డిని దమ్మపేట తహసీల్దార్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. అలాగే కమిషనర్‌ను కలిసిన వారిలో కొయ్యల అచ్యుతరావు, ఎర్రా వసంతరావు, మంగేశ్వరరావు తదితరులున్నారు.

జేఎన్టీయూ కళాశాల భవనాలకు మోక్షం ఎన్నడో?

వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో


జేఎన్టీయూ కళాశాల ముందు రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఖమ్మంరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దులపల్లి వద్ద గల వైటీసీ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న జేఎన్టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాల భవనాల నిర్మాణానికి మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ అన్నారు. జేఎన్టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాలకు భవనాలు నిర్మించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం-హైదరాబాద్ హైవేపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం జేఎన్టీయూహెచ్ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు కాగా నేటి వరకు వైటీసీ బిల్డింగ్‌లోనే విద్యాబోధన కొనసాగుతుందని విమర్శించారు. కనీసం ఇప్పటివరకు సొంత బిల్డింగ్ కేటాయించలేదన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలోని ముగ్గురు మంత్రులు దీనిపై స్పందించి ఇంజనీరింగ్ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, జార్జిరెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ నాయకులు లోకేష్, ఉమేష్, లక్ష్మణ్, మనోజ్, శ్యామల, రాము, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన పామాయిల్ గెలల ధర

టన్ను ధర రూ.18,052

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గత కొద్దినెలలుగా వరసగా తగ్గుతూ వస్తున్న పామాయిల్ గెలల ధర స్వల్పంగా పెరిగింది. గతనెలలో టన్ను గెలల ధర రూ.17463 ఉండగా ఈనెలకు సంబంధించి ధర రూ.18,052గా నిర్ణయించారు. అంటే టన్ను గెలలకు రూ.589 పెరిగింది. ఈమేరకు ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు ధరను నిర్ణయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వరుసగా ధర తగ్గుతూ వస్తుండటంతో రైతుల్లో నిరాస వ్యక్తమైంది. ఆగస్టుకు సంబంధించి ధర స్వల్పంగా పెరగటంతో రైతుల్లో కొంత ఆనందం వ్యక్తం చేశారు.

మార్కెట్ అసిస్టెంట్ సెక్రటరీపై కేసు నమోదు

ఖమ్మంక్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అసిస్టెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న పి.వీరాంజనేయులుపై ఖమ్మం త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో గత నెల 24న కేసు నమోదయింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో డేటాఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న తాడేపల్లి చంద్రకాంత్ అనే వ్యక్తి ఈనెల 23న తన సెక్షన్‌లో కంప్యూటర్, ఇతర వస్తువులు వర్షానికి తడిచిపోవడవంతో వేరే సెక్షన్‌కు వచ్చారు. ఈక్రమంలో అక్కడ ఉన్న అసిస్టెంట్ సెక్రటరీ పి.వీరాంజనేయులు చంద్రకాంత్‌ను ఉద్దేశించి దుర్భాషలాడాడు. పక్కన ఉన్న సిబ్బంది వారించినా వినకుండా చంద్రకాంత్ మెడప పట్టుకుని బయటకు నెట్టాడు. దీంతో చంద్రకాంత్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మావోల కదలికలపై పోలీసుల డేగ కన్ను

అడవులను జల్లెడ పడుతున్న బలగాలు
మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు
బిక్కు బిక్కుమంటున్న ఏజెన్సీ ప్రజలు


కరకగూడెంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై పీవీఎస్ రావు

కరకగూడెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో మావోయిస్టుల కదలికలపై పోలీసులు, ప్రత్యేక బలగాలు డేగ కన్ను వేశారు. అడవులతో పాటు మారుమూల పల్లెల్లోనూ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి మణుగూరు డివిజన్, గుండాల, దామరతోగు ములుగు, జయశంకర్, మహబూబాబాద్ జిల్లాలోని రంగాపురం, తాడ్వాయి, ఏటూరు నాగారం, పెద్దపల్లి గంగారం, పోపుగొండ్ల, కామరం, నెర్సుగూడెం, దుబ్బగూడెం అటవీ ప్రాంతాల్లో మావోయిస్టు బలగాలు సంచరిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అడవులను జల్లెడ పడుతున్నారు. కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని అంగారుగూడెం, లిమ్మగూడెం, నీలాద్రిపేట, అశ్వాపురంపాడు, మాదన్నగూడెం వలస ఆదివాసీ గ్రామాలతో పాటు పినపాక మండలంలో కూడా మావోల కదలికలపై పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. మారుమూల గ్రామాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తుండడంతో.. ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఎప్పుడు, ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన వలస ఆదివాసీ గ్రామాల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నందు వల్ల మావోల కదలికలు ఎక్కువగా ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు.. జూలై 28 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు మావోయిస్టు వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో మావోల కదలికలపై ప్రత్యేక బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ నేతృత్వంలో పోలీసులు నిత్యం గాలింపు చర్యలు చేపడుతున్నారు. వలస ఆదివాసీ గ్రామాలలో ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం ఎస్ఐ పీవీఎస్ రావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివాసీలతో మాట్లాడి మావోల కదలికలపై ఆరా తీస్తున్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు తప్పవు

వెంకటేశ్వరరావు, ఏడూళ్ల బయ్యారం సీఐ

మారుమూల గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానితులుగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. నిషేధిత మావోయిస్టులకు ఎవరైనా సహకరిస్తే కఠిన చర్యలు తప్పవు. కాలం చెల్లిన సిద్ధాంతాలను వదిలి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీసు శాఖ నుంచి సహాయ సహకారాలు అందిస్తాం.

చేపల వలే యమపాశమైంది

వలలో చిక్కుకుని.. నీట మునిగి యువకుడి మృతి
ఆళ్లపల్లి మండలం అనంతోగులో ఘటన


ప్రవీణ్‌ప్రకాష్ (ఫైల్)

ఆళ్లపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : చేపల కోసం వేసిన వలే అతడికి యమపాశమైంది. వలలో చిక్కి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. భద్రాద్రి జిల్లా గుండాల మండలం మామకన్ను గ్రామానికి చెందిన కల్తి ప్రవీణ్‌ప్రకాష్(25) శుక్రవారం కొందరు గ్రామస్తులతో కలిసి ఆళ్లపల్లి మండలం అనంతోగు వద్ద కిన్నెరసాని వాగులో ఇటీవల నిర్మించిన చెక్‌డ్యాం మడుగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో చేపల కోసం విసిరిన వలలో ప్రవీణ్‌ప్రకాష్ చిక్కుకుని నీట మునిగాడు. మడుగు లోతుగా ఉండడంతో పాటు విరిగిన పెద్దపెద్ద చెట్ల మొదళ్లు ఉండటంతో వలలో చిక్కుకున్న అతను ఎంతకీ బయటకు రాలేకపోయాడు. అతనికి తోడుగా వచ్చినవారు నీటలో దిగి వెలికితీసే సరికి ప్రవీణ్‌ప్రకాష్ మృతి చెందినట్లు తెలిపారు. అతని మృతదేహాన్ని స్వగ్రామం మామకన్నుకు తరలించారు. ప్రవీణ్‌ప్రకాష్‌కు భార్య, ఆరునెలల కుమారుడు ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో
తెగిపడిన యువకుడి చేయి

కల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెన్నూరు గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనలో సదరు యువకుడి కుడి చేయి తెగిపడింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన నామా ఆంధ్రాబాబు అనే యువకుడు టాటా ఏసీ వ్యాన్ డ్రైవింగ్ చేస్తూ రాత్రి 9 గంటల సమయంలో కల్లూరుకు వస్తుండగా చెన్నూరు ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో ఆంధ్రాబాబు కుడి చేయి తెగిపడింది. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వైద్యచికిత్స నిమిత్తం అతనిని ఖమ్మంకు తరలించారు. అతను మినరల్ వాటర్ టిన్నులు గృహాలకు చేరవేస్తూ జీవిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందేలేదని ఎస్ఐ హరిత తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

తిరుమలాయపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొక్కిరేణి గ్రామంలో శుక్రవారం పేకాట శిబిరాలపై ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో దాడిచేసి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులలో ఇద్దరు పారిపోగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారినుంచి రెండు సెల్‌ఫోన్లు, నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హైదరాబాద్ పోలీసుల అదుపులో
'గూడెం' న్యాయవాది

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ఓ న్యాయవాదిని హైదరాబాద్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్న సంఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసు నిమిత్తం హైదారాబాద్ పోలీసులు రామవరంలో నివసిస్తున్న న్యాయవాది తీసుకెళ్లారు. ఈ సమాచారం టూటౌన్ పోలీసులకు తెలియజేసి అదుపులోకి తీసుకున్నారని సమాచారం.

13 మంది జూదరుల అరెస్టు

తల్లాడ, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెం, తల్లాడ గ్రామాల్లో పేకాట ఆడుతున్న 13 మంది జూదరులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ.6390లు నగదు, నాలుగుబైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. తల్లాడలో పేకాట ఆడుతున్న మరో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.8 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్టు ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ తెలిపారు.

మోసగాడిపై కేసు నమోదు

మణుగూరు టౌన్, ఆగష్టు 1 (ఆంధ్రజ్యోతి) : మణుగూరు డిగ్రీ కాలేజి విద్యార్థులతో పాటు కొందరు నిరుద్యోగులను రైల్వే ఉద్యోగా పేరిట మోసం చేసిన వ్యక్తిపై మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. మణుగూరు సీఐ నాగబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డిగ్రీ కాలేజీలోని 75 మంది విద్యార్థులకు రైల్వేలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని విశాఖపట్నంకు చెందిన నరేంద్ర కుమార్ పట్నాయక్ అనే వ్యక్తి మోసం చేశాడు. ఒక్కొక్క బాధితుడి నుంచి రూ.12,000లను వసూలు చేశాడని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పేద కుటుంబాల్లో.. తీరని విషాదం

ముగ్గురిని మింగిన కట్టలేరు
చేపలవేటలో గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం
ఎర్రుపాలెం మండలం బంజర గ్రామంలో ఘటన


భూక్యా సాయిరాం (ఫైల్), బాదవత్ రాజు (ఫైల్), భూక్యా కోటేశ్వరరావు (ఫైల్)

ఎర్రుపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వ్యవసాయ కూలి పనులకు వెళ్లి పొట్టపోసుకునే ఆ కుటుంబాల్లో కట్టలేరు తీరని విషాదాన్ని మిగిల్చింది. చేపల వేటకు వెళ్లిన ముగ్గురిని మింగేసింది. ఈ తీవ్ర విషాదకర ఘటన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు గ్రామంలో జరిగింది. గురువారం ఎర్రుపాలెం మండలం బంజర గ్రామానికి చెందిన ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు తమకు సమీపంలోని మీనవోలు వద్ద కట్టలేరు నదికి చేపలవేటకు వెళ్లగా.. వారిలో భూక్యా కోటేశ్వరరావు(45), బాదావత్ రాజు(50), భూక్యా సాయిరాం(26) అనే ముగ్గురు గల్లంతైన విషయం తెలిసిందే. వారు బుడుగులోకి జారిపోగా.. మిగిలిన వారికి ఈత రాకపోవడంతో వారిని కాపాడేందుకు సాహసం చేయలేక పోయారు. వారు గ్రామస్థులు, పోలీసులకు సమాచారం అందించడంతో రంగంలోకి దిగిన పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలను చేపట్టారు. రాత్రి సమయంలో ఆచూకీ దొరక్కపోవడంతో.. శుక్రవారం ఉదయం ఖమ్మానికి చెందిన 25మందితో కూడిన ఎస్డీఆర్‌ఎఫ్ బృందంతో గాలింపు ముమ్మరం చేయగా.. శుక్రవారం ఉదయం ఆ ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మధిర ఆర్కే ఫౌండేషన్ సాయంతో పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అంత్యక్రియలు పూర్తి


గల్లంతైన వారి మృతదేహాలు

ఒకే గ్రామానికి చెందిన, నిరుపేదలైన ముగ్గురు వ్యక్తులు చేపల వేటకువెళ్లి మృత్యువాత పడటంతో బంజర గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నారు. మృతదేహాలుగా ఇళ్లకు తీసుకురాగా కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీరు మున్నీరయ్యారు. చిన్న గిరిజన గ్రామంలో.. అందరూ కలిసిమెలిసి ఉండే ఆ ఊళ్లో ముగ్గురు ఒకే రోజు మృతిచెందడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. కోటేశ్వరరావు, రాజు, సాయిరాం మృతదేహాలకు శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించగా.. పలు పార్టీల నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. భూక్యా కోటేశ్వరరావుకు భార్య ఇద్దరు కుమారులు, బాదావత్ రాజుకు భార్య, వివాహితులైన కుమారుడు, కూతురు, సాయిరాంకు భార్య ఉన్నారు. వారివి నిరుపేద కుటుంబాలు కావడంతో ప్రభుత్వం వారికి అండగా నిలవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

భద్రాచలం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని అశోకనగర్ కొత్తకాలనీకి చెందిన వివాహిత బి.శశికుమారి(38) ఇంట్లో ఉరివేసుకొని శుక్రవారం మృతి చెందింది. స్థానికులు నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రచలం ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేస్తామని సీఐ నాగరాజు తెలిపారు.



ఘనంగా ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం



ఖమ్మంస్పోర్ట్స్,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవాన్ని శుక్రవారం నగరంలోని పాత బస్టాండ్ వద్ద గల రైతుబజార్ ఆటో అడ్డాలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆటో కార్మికులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆటోడ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ ఆటో యూనియన్ జిల్లా నాయకులు సత్తార్ మియా, నగర కమిటీ సభ్యులు వేణు, శ్రీనివాసరావు, రఘు, శంకర్, శివ పాల్గొన్నారు.

నానో డీఏపీపై క్షేత్రస్థాయిలో రైతు అవగాహన



రఘునాథపాలెం,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలంతో పాటుగా వ్యవసాయరంగంలోని ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని, ఎరువులు, పురుగు మందుల వినియోగంలోను విప్లవాత్మక మార్పులను రైతులు తెలుసుకోవాలని ఖమ్మం డివిజనల్ వ్యవసాయ అధికారి కొంగర వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో నానో డీఏపీ, యూరియా పిచికారిపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా రైతులు భారీగా వచ్చి తెలుసుకున్నారు. వ్యవసాయ టెక్నికల్ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తూ నానో ఎరువుల వినియోగంపై వివరించారు.మండల వ్యవసాయ అధికారి కే ఉమామహేశ్వర రెడ్డి, ఏఈవో బాలబత్తుల శిరణ్మయి, మాజీ సర్పంచులు మొంటం రామారావు, తమ్మినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్టాటిస్టిక్స్ లెక్చరర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంరూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దులపల్లి పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ బోధనకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఎ.సునీత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్ట్ టైం ప్రతిపాదికన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో 55శాతం మార్కులు పొంది ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ,నీట్ సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 4వతేదీ కళాశాలలోగా అందజేయాలని సునీత ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయ విద్యా విధానం 2020 రద్దు చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం 2020 రద్దు చేయాలని, నూతన పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా. దుర్గా భవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సంఘం కార్యాలయంలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రజతోత్సవాల సందర్భంగా పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. అనంతరం ఏసీటీఎఫ్ఐ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంజాన్, నాగేశ్వరరావు, వెంకన్న, షమీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాకాసితండా వాసుల సమస్యలు పరిష్కరించాలి

తిరుమలాయపాలెం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకాసితండా వాసుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. శుక్రవారం మండలంలోని రాకాసితండాలో సీపీఎం బృందం సభ్యులు పర్యటించారు. గతేడాది అకాలవర్షంతో తండావాసులకు ఇల్లు, పొలాలు, పశువులు కొట్టుకుపోవడంతో తీవ్రంగా నష్టపోయారని ఆదుకోవాలన్నారు. తండావాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.నాగేశ్వరావు, వాసయ్య, మహేందర్, సహదేవ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు: కార్పొరేటర్ లక్ష్మీ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతాయని, నియోజకవర్గంలో పేదలసొంతింటి కలను నెరవెర్చేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషంగా కృషి చేస్తున్నారని 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు గజ్జల వెంకన్న పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హత కలిగిన లబ్ధిదారులు తమ పూరిళ్ల ఫొటోలను తీసుకొని వస్తే వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించిన ఘనత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకే దక్కిందన్నారు. రాజకీయంగా సుదీర్ఘ అనుభవం కలిగిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరో 50ఏళ్ల భవిష్యత్ ఖమ్మాన్ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న గజ్జల లక్ష్మీ, వెంకన్న

ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల్లో జాప్యం

- రెండు నెలలుగా లబ్ధిదారుల ఎదురుచూపు
- నిబంధనల ప్రకారం నిర్మాణాలు
- ఖమ్మంరూరల్ మండలంలో వెతలు

ఖమ్మంరూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): బిల్లుల్లో జాప్యం కారణంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తీవ్రఇబ్బంది పడుతున్నారు. నిబంధనలు ప్రకారం నిర్మాణాలు జరిగినా అధికారుల తీరు కారణంగా మనో వేదనకు గురవుతున్నారు. ఖమ్మం రూరల్ మండలంలో మొత్తం 497ఇళ్లు మంజురు అయ్యాయి. అందులో ఇప్పటివరకు 21 స్లాబ్ లెవల్ పూర్తి అయ్యాయి. లెంటల్ లెవల్ 37, బేస్‌మెంట్ లెవల్ 339 ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు వేగంగా జరుగుతుండగా మరికొన్ని గ్రామాల్లోనత్తనడకన సాగుతున్నాయి. ఇందులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 6 వందల ఎస్ఎఫ్‌టి లోపు మాత్రమే నిర్మాణాలు చేయాలి. కొంతమంది దానికంటే ఎక్కువ నిర్మాణం చేపట్టిన వారికి మాత్రం బిల్లు రావడంలో ఆలస్యం అవుతుండగా మరి కొందరికి మాత్రం పూర్తిగా బిల్లులు నిలిపి వేసినట్లు తెలుస్తుంది.





బిల్లుల్లో జాప్యం జరుగుతున్న లబ్ధిదారుల ఇళ్లు

ఆరెంపుల గ్రామంలో

మండలంలోని ఆరెంపుల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నారు. ఈగ్రామంలో మొత్తం 77 ఇళ్లు మంజురు అయ్యాయి. అందులో 22 స్లాబ్‌లెవల్ పూర్తయ్యాయి. మిగిలినదాంట్లో కొన్ని బేస్‌మెంట్ లెవల్, స్లాబ్‌లెవల్‌లో నిర్మాణంలో ఉన్నాయి. అయితే ఇందులో స్లాబ్ లెవల్ పూర్తి చేసుకున్న కొంతమందికి నేటికి అధికారులు బిల్లుల ఇవ్వడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ రెండు నెలలుగా అధికారులు బిల్లులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

మొహం చాటేసిన కాంట్రాక్టర్

ఆరెంపుల గ్రామంలో సుమారు 13ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఓ రిటైర్డ్ ఉద్యోగి ప్రభుత్వం అందించే రూ.5లక్షలతోనే నిర్మాణం పూర్తి చేయించి ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. తొలుత బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణం పూర్తి చేసి 13 ఇళ్లకు సంబంధించి వక్కో ఇంటికి రూ.1లక్ష చొప్పున వచ్చిన రూ. 13 లక్షల బిల్లులను లబ్ధిదారుల నుంచి తీసుకున్నాడు. అనంతరం నిర్మాణం చేపట్టకుండా మొహం చాటేశాడని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసినా.. నిర్మాణాలు జరుపుకోలేని కొందరు అత్యంత నిరుపేదలు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీంతో మొదట విడత వచ్చిన బిల్లులు తీసుకుని మిగిలిననిర్మాణం చేపట్టకుండా మొహం చాటేశాడు.

నిబంధనలు ప్రకారం బిల్లులు అందిస్తున్నాం
డీఈ జగ్రామ్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బేస్‌మెంట్ నుంచి ఇల్లు పూర్తిఅయ్యే వరకు ఎప్పటికప్పుడు బిల్లులు ఇస్తూనే ఉన్నాం. నిబంధనల ప్రకారం లేని ఇళ్లకు మాత్రం బిల్లులు ఆలస్యం అవుతుంది.

రెండు నెలలు గడుస్తోంది
కందుల భాస్కర్



ఇందిరమ్మ ఇల్లు మంజురు అయిన వెంటనే నిర్మాణం చేపట్టాను. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకున్నాను. స్లాబ్ వేసి రెండు నెలలు గడస్తున్నా.. స్లాబ్ బిల్లు మాత్రం ఇవ్వడం లేదు. అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదు.

స్లాబ్ లెవల్ బిల్లు రాలేదు
చెన్నబోయిన సైదమ్మ



నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసుకున్నా. ఇప్పటివరకు బిల్లులు వాచ్చాయి. కానీ స్లాబ్ బిల్లులు మాత్రం రెండు నెలలు ఐనా రావటం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలం కావటంతో ఇల్లు తర్వగా పూర్తి చేయాలని ఎదురు చూస్తున్నాం.

రోప్‌వేతో పర్యాటక ప్రాంతంగా ఖిల్లా అభివృద్ధి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- భూ నిర్వాసితులకు పట్టాల పంపిణీ

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్ట్1(ఆంధ్రజ్యోతి): రోప్‌వే నిర్మాణంతో ఖిల్లా ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు భూనిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేశారు. రోప్ వే ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న నిర్వాసితులకు బల్లేపల్లి వద్ద మంచి విలువైన భూమి పట్టాలను పరిహారంగా అందిస్తున్నామని తెలిపారు. జిల్లా అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, అర్బన్ తహసీల్దార్ సైదులు తదితరులు ఉన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం, భూసేకరణపై సమీక్ష

ఖమ్మం మున్నేరు అభివృద్ధి పనులతో పాటు అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మున్నేరు నది రిటైనింగ్‌వాల్ నిర్మాణం పురోగతి అభివృద్ధి పనులు, భూసేకరణ, భూనిర్వాసితులకు ఇచ్చే లే- ఔట్ పనులపై శుక్రవారం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మున్నేరునది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు నవసరమైన భూ సేకరణలో నిర్వాసితులకు ఇచ్చే స్థలం లేఔట్ పనుల పురోగతిని, ప్రధానరహదారి,10 మీటర్ల ఓవర్ బ్రిడ్జి నిర్మాణ నమునా తదితర అంశాలను అధికారులు వివరించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ వర్కింగ్ మ్యాప్ ను కలెక్టర్ పరిశీలించారు.హైదరాబాద్‌లోని ప్రైవేట్ లేఔట్ తరహాలో మన లేఔట్ అభివృద్ధి చేయాలని, ఈపనులు ఎప్పుడు పూర్తి అవుతాయో స్పష్టమైన గడువు నిర్దేశించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేకఅధికారి రమేష్, నీటి పారుదలశాఖ డిప్యూటీ ఈఈ. రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైడే కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్

ప్రజలు స్వచ్ఛందంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చునని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఖమ్మం నగరం 3వ డివిజన్ బల్లేపల్లి రెయిన్‌బో నగర్ లో ప్రజలకు దోమల వల్ల సంక్రమించే సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

రేపు ఆర్యవైశ్య రాజకీయ చైతన్య సదస్సు

నేలకొండపల్లి పట్టణ అధ్యక్షుడు హనుమంతరావు

నేలకొండపల్లి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గ స్థాయి ఆర్య వైశ్యుల రాజకీయ చైతన్య సదస్సును ఆదివారం నేలకొండపల్లిలోని వాసవీభవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘవ పట్టణ అధ్యక్షుడు రేగూరి హనుమంతరావు చెప్పారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ చైతన్య సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని నేలకొండపల్లి,తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్,కూసుమంచిమండలాలకు చెందిన ఆర్యవైశ్య మండల, పట్టణ, గ్రామ అధ్యక్షులతో పాటుగా ఆర్యవైశ్యవర్గానికి చెందిన అన్ని పార్టీల మాజీ ప్రజాప్రతినిధులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఏపీఎం బాధ్యతల స్వీకరణ

కామేపల్లి,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): కామేపల్లి సెర్ప్ ఏపీఎంగా మాదాసు వెంకటరామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏన్కూర్ మండలం నుంచి ఇక్కడి బదిలీపై వచ్చారు. సీసీ వీరభద్రం, మల్లయ్య, సరోజ, ప్రసాద్, శ్రీను సత్కరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తిరుమలాయపాలెం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి జిల్లా నాయకుడు ఏవీ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో ఆయన మాట్లాడారు.

రేపు లారీ యజమానుల సంఘం ఎన్నికలు

- ఇప్పటికే అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ఇద్దరు జాయింట్ సెక్రెటరీ పదవులు ఏకగ్రీవం
- రేపు ప్రధాన కార్యదర్శి, మరో ఉపాధ్యక్ష పదవులకు ప్రత్యక్ష ఎన్నిక

ఖమ్మంమార్కెట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం నగరంలోని లారీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఆసంఘం బాధ్యులు ఎన్నికలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే నాలుగు కీలక పదవులతో పాటు, 8మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్ల పదవులు ఏకగ్రీవం కాగా, ప్రధాన కార్యదర్శి పదవితో పాటు మరో ఉపాధ్యక్షుడి పదవుల కోసం ఎన్నికలు ప్రత్యక్షంగా నిర్వహించనున్నారు. ఎన్నికల్లో భాగంగా మూడు రోజుల క్రితమే సంఘ అధ్యక్షురాలుగా బోయపాటి క్రిష్ణకుమారి, ఉపాధ్యక్షుడిగా బి.శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలుగా మస్తాన్‌వలీ, మహ్మద్‌అలీంతో పాటు ట్రెజరర్‌గా చంద్ర సీతారాం మరో 8 మందిని ఈసీ మెంబర్లను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరగనున్న ఎన్నికలలో ప్రధాన కార్యదర్శి పోటీకి కొమ్ము మధుకుమార్, దబ్బు శ్రీనివాస్, షేక్ జానీబాబు, సుంకి మదారయ్య బరిలో నిలవగా, మరో ఉపాధ్యక్షుడి పదవి పోటీకి తేజావత్ వీరన్న, పొట్లపల్లి సర్వయ్య బరిలో నిలిచారు. కాగా ఎన్నికలలో సుమారు 424 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల అధికారిగా అడ్వకేట్ కొత్తా వెంకటేశ్వరరావు వ్యవహరిస్తున్నారు.

ప్రతీ సోమవారం డివిజన్ స్థాయిలో ప్రజావాణి

- ప్రతీ పనిలో వార్డు ఆఫీసర్లే కీలకం
- పారిశుధ్యం నుంచి అభివృద్ధి వరకు పర్యవేక్షణ జరపాలి
- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇకనుంచి ప్రతీ సోమవారం ప్రతీ డివిజన్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. వార్డు ఆఫీసర్లు డివిజన్‌లోని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. అవసరమైన వాటిని స్థానిక జోనల్, లేదా కేఎంసీ అధికారులకు సిఫారసులు చేసి వాటి పరిష్కారం చూపాలన్నారు. శుక్రవారం కేఎంసీ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, పారిశుద్యం, ఉద్యన విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఖమ్మంనగరంలో పారిశుధ్యం పర్యవేక్షణపై పూర్తి అధికారాలు వార్డు ఆఫీసర్లుకు ఇచ్చామని, కార్మికులు, జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెపెక్టర్లు హాజరు రికార్డులు, పారిశుద్య వాహనాల నిర్వాహణ, డిజీల్ కూపన్లు పంపిణీ వంటి అంశాలను ఇకమీదట వార్డు ఆఫీసర్లు చూసుకోవాలని ఆదేశించారు. మంచి పనితీరు కనబర్చిన వారికి ఉత్తమ వార్డుఆఫీసర్ అవార్డులను ఇచ్చి ప్రోత్సహిస్తామని చెప్పారు. డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో దోమలు, లార్వ నివారణ మందులు పిచికారీ చేయాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణపై పరిశీలన చేయాలని వారం రోజుల యాక్షన్ ప్లాన్‌ను ముందుగానే ప్రకటించాలన్నారు. ఖమ్మం నగరం స్వచ్ఛత, పారిశుధ్యం, ప్రజలతో నేరుగా సంబంధాలు, పౌర సేవలు అమలులో కీలకంగా బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎంసీ అనిల్, ఉద్యన విభాగం అధికారి బెల్లం రాధిక పాల్గొన్నారు.



సమీక్ష జరుపుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్
- తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ

ఖమ్మంకలెక్టరేట్, జూలై1: తల్లి పాలు బిడ్డకు అమృతమని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మెతుకు నరేందర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా జనరల్ ఆస్పత్రి అధికారులు, వైద్యులు, మిల్క్‌బ్యాంకు సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని సూపరింటెండెంట్ ప్రారంభించారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజెప్పేందుకు కొన్నేళ్లుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యూనిసెఫ్) రెండు దశాబ్దాలుగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తోందని వివరించారు. పాలు పట్టడంతో బిడ్డతో పాటు తల్లి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి,మాతా శిశు సంరక్షణ కేంద్రం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. గవర్నమెంటు నర్సింగ్ కాలేజీ, ఏంజెల్ నర్సింగ్ కాలేజీ, కిన్నెర నర్సింగ్ కాలేజీ, పులిపాటి నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్ కుమార్ ఆర్ఎంవో వినాయక్ రాథోడ్, గైనకాలజీ హెచ్‌వోడీ యామిని, ఆర్థో విభాగం హెచ్‌వోడీ ఎల్. కిరణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డి.శాంతకుమారి, గ్రేడ్ -2 నర్సింగ్ సూపరింటెండెంట్లు రత్నకుమారి, లక్ష్మి, ఎమిలియా మేరీ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారుల ర్యాలీ

ఖమ్మంఖానాపురం హవేలి: అమ్మపాలే అమృతం, పుట్టిన ప్రతి బిడ్డకు అమ్మపాలే అందించాలని నినాదాలు చేస్తూ శుక్రవారం నగరంలోని అంబేద్కర్‌సెంటర్ నుంచి ఇల్లెందు క్రాస్‌రోడు వరకు మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్ రెడ్డి ఖమ్మం అర్బన్ సీడీపీఓ వీరభద్రమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టిస్తే సహజ రోగ నిరోధక శక్తి కలిగేలా చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.





ర్యాలీని ప్రారంభిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేందర్, తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న డీడబ్ల్యూవో, అంగన్‌వాడీ టీచర్లు

అమల్లోకి కొత్త రూల్

(5వ పేజీ తరువాయి)

కొణిజర్ల, ముదిగొండ, ఖమ్మం రూరల్, అర్బన్, కూసుమంచి, రఘునాథపాలెం, నేలకొండపల్లి, వైరా, తల్లాడ, బోనకల్ తోపాటు ఏజెన్సీ మండలాల్లో అధికంగా ఆన్‌లైన్ సమస్యలు వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్ పట్టుకొని హాజరుపై దృష్టి పెట్టడంతో ఆ ప్రభావం బోధనపై పడింది. యాప్ ఎప్పుడు పని చేస్తుందో తెలియక ఉపాధ్యాయులు సరైన సమయానికి తరగతులు చెప్పలేదని తెలిసింది. ఉపాధ్యాయులు తాము పని చేస్తున్న పాఠశాల ప్రాంగణం నుంచే హాజరు వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం జియో కోఆర్డినేట్ అటెండెన్స్ అమలు కానుంది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం స్కూల్ ఆవరణ నుంచే లాగిన్, లాగౌట్ అవుతూ.. హాజరు నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల ఆ రోజు క్లాస్‌కి ఎంత మంది విద్యార్థులు వచ్చారు? మొత్తం పాఠశాలకు ఎంత మంది హాజరయ్యారు? ఏ సమయంలో హాజరు తీశారు? అన్న వివరాలు నేరుగా ప్రభుత్వానికే తెలియనుంది. ఇదే విధానాన్ని ఉపాధ్యాయులకు అమలు చేసి.. వారి గైర్హాజరీ, విధులకు జాప్యంపై చెక్ పెట్టనుంది.



అమల్లోకి కొత్త రూల్

(5వ పేజీ తరువాయి)

కొణిజర్ల, ముదిగొండ, ఖమ్మం రూరల్, అర్బన్, కూసుమంచి, రఘునాథపాలెం, నేలకొండపల్లి, వైరా, తల్లాడ, బోనకల్ తోపాటు ఏజెన్సీ మండలాల్లో అధికంగా ఆన్‌లైన్ సమస్యలు వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్ పట్టుకొని హాజరుపై దృష్టి పెట్టడంతో ఆ ప్రభావం బోధనపై పడింది. యాప్ ఎప్పుడు పని చేస్తుందో తెలియక ఉపాధ్యాయులు సరైన సమయానికి తరగతులు చెప్పలేదని తెలిసింది. ఉపాధ్యాయులు తాము పని చేస్తున్న పాఠశాల ప్రాంగణం నుంచే హాజరు వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం జియో కోఆర్డినేట్ అటెండెన్స్ అమలు కానుంది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం స్కూల్ ఆవరణ నుంచే లాగిన్, లాగౌట్ అవుతూ.. హాజరు నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల ఆ రోజు క్లాస్‌కి ఎంత మంది విద్యార్థులు వచ్చారు? మొత్తం పాఠశాలకు ఎంత మంది హాజరయ్యారు? ఏ సమయంలో హాజరు తీశారు? అన్న వివరాలు నేరుగా ప్రభుత్వానికే తెలియనుంది. ఇదే విధానాన్ని ఉపాధ్యాయులకు అమలు చేసి.. వారి గైర్హాజరీ, విధులకు జాప్యంపై చెక్ పెట్టనుంది.

మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

» సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, ఆగష్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు విషజ్వరాలు ప్రబలకుండా ముందుస్తుగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రక్తపీడితులను గుర్తించడంతోపాటు వారి ఇంటి నుంచి రక్తనమూనాలు సేకరించాలని, జ్వరం నిర్ధారణ అయితే వెంటనే ఆసుపత్రులకు చేర్చి వైద్యం అందించాలని కోరారు శుక్రవారం ఓ కార్యక్రమంలో తెలిపారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

మతిభ్రమించి ఏపీ సీఎంపై విమర్శలు

ఏన్కూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి, మతిభ్రమించి బీఆర్ఎస్ పార్టీనాయకులు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుపై బనకచర్ల విషయంలో విచక్షణ రహితంగా బురద చల్లడం సరికాదని టీడీపీ పార్టీ మండల కమిటీ ముక్తకంఠంతో ఖండించింది. స్థానిక కమ్మవారి కళ్యాణ మండపంలో శుక్రవారం అత్యవసర మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పలువురు వక్తలు ప్రసంగించారు. టీడీపీ తెలంగాణలో రోజు రోజుకి అభివృద్ధి చెందుతూ అధికారంలోకి వస్తుందనే భయంతోనే ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జాస్తి జనార్థన్, ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, కమ్మ సంఘం అధ్యక్షుడు తోట రాధాకృష్ణ, జిల్లా నాయకులు తాళ్లూరి అప్పారావు, రామయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి రూ.22వేల ఆర్థికసాయం

ముదిగొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన దరిపల్లి పుల్లయ్య, జానకీ దంపతుల కుమార్తె అనూష బీటెక్ చదివేందుకు ఆర్థికస్థోమత లేకపోవడంతో ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. శుక్రవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో చైర్మన్ యలగొండస్వామి అనూషకు రూ.22వేల నగదును అందజేశారు. పేద విద్యార్థిని చదువుకునేందుకు ఆర్థిక సాయం చేయడం పట్ల దాతను పలువురు అభినందించారు.

'స్థానికం'లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి

» డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గప్రసాద్

వైరా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అఖండ విజయం చేకూర్చాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. శుక్రవారం వైరాలోని ఎస్‌వీఎస్ గార్డెన్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులుగా నియమితులైన వారి సారథ్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నాయకత్వంలో అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు కట్ల రంగారావు, నూతి సత్యనారాయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు షేక్.గౌస్, నాయకులు సూర్యదేవర శ్రీధర్, బొర్ల రంగారావు, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌కు సాహితీ అవార్డు



అవార్డు అందుకుంటున్న జైదాస్

మధిర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జైదాస్‌కు ముల్కనూర్ సాహితీ పీఠం అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ముల్కనూర్ సాహితీ పీఠం అధిపతి వేముల శ్రీనివాస్ ఈ అవార్డును అందజేశారు. జైదాస్ రచించిన మరో గాలి వాన అనే కథకు ఈ అవార్డు లభించింది. ఈ అవార్డు కోసం రెండు తెలుగు రాష్ట్రల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి 417 కథలు రాగా అందులో నుంచి జైదాస్ రాసిన కథ ఎంపిక అయ్యింది. ఈ సందర్భంగా జైదాస్‌ను పలువురు సాహితీ ప్రియుల తోపాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు .

యూరియాను సద్వినియోగం చేసుకోవాలి

ముదిగొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ సొసైటీ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి సూచించారు. శుక్రవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో రైతులకు యూరియా కట్టలను అందజేశారు. అనంతరం ఏవో సరితతో కలిసి యూరియా స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో వెంకటరత్నం, ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థకు బకాయిల భారం

» సింగరేణి కూడా ఆర్టీసీ వలే సంక్షోభంలోకి
» ఏబీకేఎంఎస్ కార్యదర్శి మాధవ నాయక్



సమంత క్యాంప్‌లో మాట్లాడుతున్న మాధవనాయక్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కోకు చెందిన విద్యుత్ సరఫరా బకాయిలు రూ.24,918.32కోట్లు, జెన్‌కోకు బొగ్గు సరఫరా బకాయిలు రూ.14,743.25కోట్లు ఉండగా అవి పెరిగి నేడు సింగరేణి సంస్థకు భారంగా మారాయని ఏబీకేఎంఎస్ కార్యదర్శి, వేజ్‌బోర్డ్ సభ్యుడు పీ.మాధవనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సమంత సీహెచ్‌పీ క్యాంప్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ కాలంలో రూ.26వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండగా ఇప్పటి ప్రభుత్వ సమయంలో అవి ఇప్పుడు రూ.39,661.57కోట్లకు చాంతాడులా పెరిగాయన్నారు. తీవ్ర ఆర్థిక భారంతో సంస్థ కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడానికి, టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేసుకోవడానికి వీలులేకుండా పోయిందన్నారు. ఈ తరహా నిర్లక్ష్యం కొనసాగితే సింగరేణి కూడా ఆర్టీసీ వలే సంక్షోభంలోకి జారిపోతుందన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతుందన్నారు. గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్‌టీయూసీ ఈ అంశంపై స్పందించకపోవడం దురదృష్టకరమని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే కార్యక్రమాలకు బీఎంఎస్ సంపూర్ణ మద్ధతు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో జీ.వెంకటరెడ్డి, జీవీ.కృష్ణారెడ్డి, మొగలిపాక రవి, ఊట్ల గణేష్, ఇనపనూరి నాగేశ్వరరావు, శ్యాంప్రసాద్, ఉదయ్‌భాస్కర్, చారి, బలి శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో రాణించాలి

తల్లాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని తల్లాడ ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ సూచించారుక. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో అండర్ 16 పాఠశాలల స్థాయిలో ఈనెల 5నుంచి కల్లూరులో నిర్వహించనున్న రాజీవ్ గాంధీ క్రికెట్ టోర్నమెంట్ ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.



స్థానిక సమస్యలపై సీపీఎం ఫోకస్

వైరా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ సమస్యల పరిష్కారం కోసం ప్రజల భాగస్వామ్యంతో ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో మచ్చా మణి అధ్యక్షతన జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలను ప్రజలకు వివరించి సమస్యల పరిష్కారానికి ప్రజల మద్దతు కోరుతూ ప్రతి కుటుంబాన్ని కలవాలని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. మునిసిపాలిటీలో సమస్యల పరిష్కారానికి పలు దఫాలుగా ఆందోళనలు చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని, రూ.వేలల్లో పన్నులు వసూలు చేస్తూ కనీసం వీధి లైట్లు కూడా వేయలేని పరిస్థితి మునిసిపాలిటీలో నెలకొందని విమర్శించారు. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, ఎక్కడికక్కడా మురుగు గుంతల్లో దోమలు, పందుల బెడద ఎక్కువ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

బనకచర్ల ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి ఏ ముప్పు లేదు



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

వైరా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీ బలపడుతుందనే భయంతో బీఆర్ఎస్ పార్టీ ప్రాజెక్టుల పేరుతో ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టాలని చూస్తోందని, బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎటువంటి నష్టం లేదని టీడీపీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు అన్నారు. శుక్రవారం వైరాలోని ఎన్టీఆర్ భవన్‌లో మండల అధ్యక్షుడు కిలారు సురేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు కత్తులు దూయటం కాదు, వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు. ప్రతి ఏటా మూడువేల టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో వృథాగా కలుస్తున్నాయని, బీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు 83వేల కోట్ల ఎకరాల సాగుభూమి ఉందని, అపారమైన జలసంపద ఉందని, 140వేల టీఎంసీల నీరు వృథాగా పోతుందని ఆ నీరును ఉపయోగించుకోవడం తప్పేలా అవుతుందని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ బనకచర్లపై నేడు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జగన్, కేసీఆర్ కవల పిల్లల మాదిరిగా ఇద్దరూ అధికారంలో ఉన్నప్పుడు ఒకరకంగా, అధికారంలో లేనప్పుడు మరోరకంగా మాట్లాడడాన్ని ప్రజలు ఎప్పటికి ఒప్పుకోరని, సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం ఏటా మూడువేల టీఎంసీలు గోదావరి జలాలు సముద్రం పాలవుతుంటే రాయలసీమ సాగునీటి కష్టాలు తీర్చటానికి చంద్రబాబునాయుడు చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై అసూయ ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో మండల కార్యదర్శి గాదె రామకృష్ణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, సొసైటీ మాజీ చైర్మన్ మందడపు మధుసూదన్‌రావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, మన్నేపల్లి ప్రదీప్, పమ్మి అర్జున్‌రావు, సూర్యదేవర వెంకటకృష్ణ, గంగవరపు మోహన్‌రావు, సంక్రాంతి శ్రీనివాసరావు, చింతల శ్రీనివాసరావు, సైదులు పాల్గొన్నారు.

మధిరలో రైల్వే డీఆర్ఎం పర్యటన

» పది నిమిషాల్లో ముగిసిన తనిఖీలు



ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న డీఆర్ఎం

మధిర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే డివిజన్ డీఆర్ఎం గోపాలకృష్ణన్ శుక్రవారం మధిర రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రత్యేక రైలులో వచ్చిన ఆయనకు మధిర రైల్వే అధికారులు స్వాగతం పలికారు, కేంద్ర ప్రభుత్వం మధిర రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ పథకం కింద ఎంపిక చేసి 25 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఈ పథకం కింద మధిర రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రైల్వే అధికారులతో కలిసి డీఆర్ఎం పరిశీలించి పలు సూచనలు చేశారు. అనుకున్న షెడ్యూల్ సమయానికి వచ్చిన డీఆర్ఎం పది నిమిషాల్లోనే తన పర్యటనను ముగించుకుని వెళ్లిపోగా మధిరలో పలు రైళ్ల హాల్టింగ్ కోసం ఆయనకు వినతిపత్రాలు ఇద్దామని వచ్చిన ప్రయాణికుల సంఘం వారితోపాటు పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు నిరాశ చెందారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీనియర్ డీఓఎం సురేష్ రెడ్డి, సీనియర్ డీఎస్‌టీఈ ప్రియా అగర్వాల్, సీనియర్ డీసీఎం షిఫా కుమార్, మధిర స్టేషన్ మాస్టర్ సుధీర్‌బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంస్థాగత కమిటీల ఏర్పాటు

కల్లూరు, ఆగష్టు1 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా గ్రామ స్థాయిలో బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంస్థాగత గ్రామ కమిటీల ఎన్నిక ప్రక్రియ పూర్తి కావచ్చింది. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదేశాను సారంగా మండలంలోని 23 గ్రామ పంచాయితీల్లో ఈ కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎంపిక గత పక్షం రోజుల నుంచి చేపట్టారు. ఇప్పటి వరకు 20 పైగా గ్రామాల్లో సంస్థాగతంగా కాంగ్రెస్ కమిటీలు వేయగా, ఇంకా మరో మూడు పంచాయితీల్లో ఆదివారం నాటికి ఈ కమిటీల ప్రక్రియ పూర్తి కావస్తుందని కాంగ్రెస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు ముకర విజయరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇంకా పది గ్రామ పంచాయితీలు కల్లూరు మునిసిపాలిటిలో వీలినం కాగా వాటికి కూడా కలిపి త్వరలో కమిటీ వేయటం జరుగుతుందని తెలిసింది. ఈ గ్రామ కమిటీల ఎన్నిక పూర్తియితే కాంగ్రెస్ పార్టీ ఆయా గ్రామాల్లో రాజకీయంగా బలోపేతం అయ్యేందుకు మార్గం సుగమవుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. మరో వైపున గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కూడా ఈ కమిటీల పాత్ర కీలకంగా మారనున్నది. మండల సోషల్ మీడియా అధ్యక్షుడు విజయరావు నేతృత్వంలో ఈ గ్రామ కమిటీల ఎన్నిక సాజవుగా సాగేలా గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయటంలో కీలక పాత్ర వహించారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాజకీయ కార్యకాలపాలు జరేగే అవకాశాలు ఉన్నాయి. దీంతో గ్రామాల్లో కమిటీల ఏర్పాటుతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పనిచేసేలా సిద్ధంగా ఉన్నారు.

సత్తుపల్లి ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఎన్నిక

సత్తుపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా భాష, రాంబాబులు నియమితులయ్యారు. ఈ సందర్బంగా శుక్రవారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించేందు అన్నీ వేళల అందుబాటులో ఉంటామని వారు తెలిపారు. ట్రెజరర్‌గా శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షుడిగా హరీష్, కార్యవర్గ సభ్యులుగా సుబ్బారావు, ఫణికుమార్, కృష్ణ, గాంధీ, మురళీ, నరేష్, ప్రభాస్, అన్వర్‌భాష, నరసింహారావు, గౌరవ అధ్యక్షుడిగా పరిమి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, సతీష్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావులు నియమితులయ్యారు. టెక్నాలజీకి అనుగుణంగా ఫొటోగ్రాఫర్లకు వర్క్‌షాపులు జిల్లా సహకారంతో ఏర్పాటు చేయిస్తామని, అందరికి అండగా ఉంటామని తీర్మానించారు. కార్యక్రమంలో సుమాంజలి రాము, కనకారావు, తిరుపతి, సతీష్, తిరుమలరావు, రఘు, హరేంద్రనాద్, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



కోదండ రామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

వైరా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వైరా కోదండ రామాలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా వాసవీ, వనిత సభ్యుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా సామగ్రిని వాసవీ, వనిత ఆధ్వర్యంలో ఉచితంగా అందజేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వాసవీ, వనిత సభ్యురాళ్లు కొదుమూరి భాగ్యలక్ష్మీ, బొగ్గవరపు సునీత, తడికమళ్ల శ్రీదేవి పాల్గొన్నారు.

కాలనీ నూతన కమిటీ ఎన్నిక

కారేపల్లి ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కారేపల్లిలోని శ్రీవెంకటసాయినగర్ కాలనీలో శుక్రవారం నూతన కమిటిని ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా గుగులోత్ రాంబాబు, ఉపాధ్యక్షుడిగా పోదెం రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ.. కాలనీ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీణ్, బాస్కర్ సమ్మయ్య, శంకర్, నాగేశ్వరరావు, ఈశ్వర్, సీతారాములు, రామకృష్ణ,బి.హనుమంతరావు, సాంబశివరావు, రాజు, వెంకన్న, రామారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్ వాడీ ఉద్యోగులు

కల్లూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో నేటి నుంచి 7వ తేది వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించేందుకు తగిన ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సీహెచ్ నిర్మలజ్యోతి చెప్పారు. శుక్రవారం కల్లూరు ప్రాజెక్ట్ కార్యాలయంలో కల్లూరు, తల్లాడ, పె నుబల్లి మండలాల పరిధిలో గల సెక్టార్ల సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తమ ప్రాజెక్టు పరిధలో గల అంగన్వాడీ కేంద్రాలలో టీచర్లుకు తల్లిపాల ప్రాముఖ్యతను సీడీపీఓ నిర్మల జ్యోతి వివరించారు. తల్లిపాలు బిడ్డపుట్టిన వెంటనే పట్టించాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో తల్లుల కమిటీలను భాగస్వామ్యం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏసిడిపిఓ రత్తమ్మ, నవ్యశ్రీ, సూపర్వైజర్లు సుజాత, సంధ్యారాణి, భవానీ, వెంకటమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

తల్లాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ ఏసీడీపీవో నవ్యశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని బాలపేటలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు ఆరు నెలలనుంచి రెండేళ్లపాటు తల్లిపాలు ఇవ్వడం ఎంతో ఆరోగ్యకరమన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సూపర్‌వైజర్ కె.సత్యవతి, టీచరచ్లు రుక్మిణి, వరలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూమి సునీల్

సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మధిర రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ, భూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని, వీటిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకే తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో 'సాగు న్యాయ యాత్ర' కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వ్యవసాయ చట్టాల నిపుణుడు భూమి సునీల్ తెలిపారు. శుక్రవారం సాగు న్యాయయాత్ర- రైతులకు చట్టాలు చుట్టాలవ్వాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్, లీఫ్ సంస్థ ఆధ్వర్యంలో మధిర రైతు వేదికలో భూ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి సునీల్ మాట్లాడుతూ.. జూన్ 28న ప్రారంభించిన సాగు న్యాయ యాత్ర అక్టోబరు రెండు వరకు 2400కిలోమీటర్లు, 8వేల గ్రామాల్లో జరుగుతుందన్నారు. లక్షమంది రైతులకు అవగాహన కల్పించటమే లక్ష్యంగా ఈ యాత్ర సాగుతుందన్నారు. భూభారతి రూపకర్త బి.హరి వెంకటప్రసాద్, లీఫ్ సంస్థ న్యాయవాదులు జీవన్, అభిలాష్, మల్లేష్, రవి, ప్రవీణ్, వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్, ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, అధికారులు, ఆత్మడైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ మిషన్ ఆధ్వర్యంలో రైతులకు భూమి, వ్యవసాయ చట్టాలపై శుక్రవారం అవగాహన కలిగించారు. ఈ సదస్సుకు ప్రముఖ భూ చట్టాల నిపుణుడు భూమి సునిల్ హాజరై రైతులు ఎదుర్కొటున్న ప్రధాన భూ, వ్యవసాయ సమస్యలపై సదస్సులో అవగాహన కలిగించారు. రైతులందరికీ భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టంతోపాటు అన్ని భూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. లీఫ్ సంస్థ న్యాయవాదులు జీవం, అభిలాష, మల్లేష్, రవిప్రవీణ్, తహసీల్దార్ మన్న ఉషాశారద, ఏవో బి.సాయిశివ, మార్కెట్ కమిటీచైర్మన్ నరసింహారావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్లసాయికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఎఫ్ఏ'ల సమస్యల పరిష్కారం పట్ల హర్షం

పెనుబల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేసినందుకు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కర్రి సదానందరావు, రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి చురగంటి సూర్యం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి సీతక్కలకు ధన్యవాదాలు తెలిపారు.

వైరా మండలంలో ముమ్మరంగా వరినాట్లు



దమ్ము చేస్తున్న ట్రాక్టర్, నాటు వేస్తున్న బెంగాలీ కూలీలు

వైరా, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల కొన్ని సంవత్సరాల కాలంలో ఈ ఏడాది జూలైలోనే ఖరీఫ్ నాట్లకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈనెల 15న రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేశారు. అంతకముందే పదోతేదీన అనధికారికంగా నీరు విడుదల చేయడంతో రైతులు వరినార్లు పోసుకున్నారు. అయితే అంతకముందే కొంతమంది రైతులు వాగులు, ఏర్లు ఇతర నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో వరినార్లు పోశారు. కాల్వలకు నీరు విడుదల చేయడంతో ఆ రైతులంతా ఇప్పుడు వరినాట్లు వేస్తున్నారు. సోమవరం నల్లచెరువు కింద రైతులు నేరుగా వరి విత్తనాలు వెదజల్లారు. దాచాపురం రైతులు నెలరోజుల కిందటే వరినాట్లు చేపట్టి ఇప్పటికే పూర్తిచేశారు. గన్నవరం, ఖానాపురం, గరికపాడు, ముసలిమడుగు తదితర గ్రామాల్లో కూడా అనేక మంది రైతులు ఇప్పటికే నాట్లు వేశారు. ఇప్పుడు రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల పైభాగంలోని రైతులు వరినాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఎడమ కాల్వ 12వ నెంబర్ తూము తర్వాత నీటి సరఫరా లేకపోవడంతో చివరి ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గరికపాడు బ్రాంచ్ కెనాల్, లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్ చివర్లో పూడికతీత పనులు చేస్తున్నందున రెండువైపులా నీటి సరఫరా నిలిపివేశారు. అలాగే కుడి కాల్వ చివర్లోని రైతులకు కూడా నీటి సరఫరా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఈ రెండు కాల్వల చివర్లో పూడికతీత పనులు త్వరగా పూర్తిచేసి తమకు సమృద్ధిగా నీరు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

రూ.రెండున్నర లక్షల ఎల్‌వోసీ చెక్కు అందజేత



ఎల్‌వోసీ చెక్కు అందజేస్తున్న నాయకులు

ముదిగొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వనంవారిక్రిష్టాపురం గ్రామానికి చెందిన పొదిలి శరణయ్య ఆస్పత్రి వైద్యఖర్చుల కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌వోసీ చెక్కును కాంగ్రెస్ నాయకుడు మల్లెల అజయ్ శుక్రవారం అందజేశారు. రూ.రెండున్నర లక్షల ఎల్‌వోసీ చెక్కు అందజేయటం పట్ల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు శరణయ్య కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మల్లెల అజయ్, పొదిలి తిరుపయ్య, ఏటుకూరి వెంకటేశ్వర్లు, బాబూరామిరెడ్డి, పాపారావు, పుల్లయ్య, నాగయ్య పాల్గొన్నారు.